JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | శనివారం 21-03-2026
Medchal - Malkajgiri | Saturday 21-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 293
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 293 | Pages : 8 | ₹: 5







రైతు సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాలతో కూడిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, విద్యార్థులకు పౌష్టికాహారం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, తెలంగాణను సుస్థిరమైన అభివృద్ధి వైపుకి నడిపించే లక్ష్యంతో 2026-, 27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,24,234 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన వార్షి క బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

జయభేరి, హైదరాబాద్ :

"ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే పరిపాలన లక్ష్యం అని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పినట్టు, వారి అడుగుజాడల్లోనే పాలకులుగా కాకుండా సేవకులుగా పరిపాలన సాగిస్తున్నాం" అని బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శాసనసభ కమిటీ హాలులో జరిగిన మంత్రిమండలి సమావేశం బడ్జెట్ ప్రతిపాదలకు ఆమోదం తెలిపింది. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టీ విక్రమార్క 2026, 27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసనమండలిలో ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి, ధనిక అని తేడా లేకుండా రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పేరుతో సరికొత్త పథకాన్ని బడ్జెట్‌లో ప్రతిపాదించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, యువత భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పాలిటెక్నిక్ కాలేజీలను ఏటీసీలుగా తీర్చిదిద్దడం వంటి అనేక కీలక ప్రతిపాదనలు చేసింది. తెలంగాణ రైసింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ప్రాధాన్యాతా రంగాలకు పెద్దపీట వేసింది. "తెలంగాణ ప్రజల ఆశలు ఆశయాలను నిజం చేసే సంకల్పపత్రమే ఈ బడ్జెట్. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అద్దం పట్టేలా బడ్జెట్‌ను రూపొందించాం. రాజ్యాంగ విలువలకు కట్టుబడి, పారదర్శకతతో పాలన సాగిస్తున్నాం. గొప్పల కోసం మేం అబద్ధాలను చెప్పకుండా వాస్తవ పునాదుల మీద ప్రభుత్వం పనిచేస్తుంది" అని ఆర్థిక మంత్రి భట్టీ విక్రమార్క ప్రకటించారు.

## పాలకులం కాదు..
# ప్రజా సేవకులం..
### మొత్తం బడ్జెట్ - రూ.3,24,234 కోట్లు

- జూన్ 2వ తేదీ 2026 నుంచి రాష్ట్రంలో సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, మధ్య తరగతి, ధనిక అని తేడా లేకుండా రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా అందించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం.
- విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం. 2026, 27 విద్యా సంవత్సరం నుంచి ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో రాష్ట్రంలో నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించనుంది. బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రతి విద్యార్థికి వారానికి 3 రోజులు పాలు, మిగతా మూడు రోజులు రాగిజావ అందించడం.
- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా ఇకపై కొత్తగా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం. విద్యార్థుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యల్లో ఇదొక సరికొత్త అధ్యాయానికి నాంది.
- రాష్ట్రంలోని 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దడం. ఉద్యోగావకాశాలు కల్పించడం, ఎంటప్రెన్యూర్లుగా ఎదగడానికి వీలుగా పాలిటెక్నిక్ కాలేజీల్లో 2026, 27 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా 15 కోర్సుల ప్రారంభం.

**సంక్షేమ పథకాలకు పెద్దపీట:**

- చేయూత పథకం కింద అర్హులైన వారికి కొత్తగా 2 లక్షల పెన్షన్ల మంజూరు.
- మహాలక్ష్మి పథకంలో ప్రతిరోజూ రాష్ట్రంలో 34.37 లక్షల మంది ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం. ఇప్పటివరకు వరకు ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు 269.68 కోట్ల ఉచిత ప్రయాణాలు చేయడం ద్వారా ఆదా అయిన మొత్తం రూ. 9,222 కోట్లు.
- మహిళలకు ఉపశమనం కల్పించేందుకు ప్రారంభించిన రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్ అందించడం వల్ల 42.90 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుండగా, తద్వారా మహిళలకు రూ. 752 కోట్లు ఆదా.
- గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందించడం వల్ల దాదాపు 53.9 లక్షల పేద, మధ్య తరగతి కుటుంబాలకు 10.97 కోట్ల మేరకు సున్నా బిల్లులు జారీ కాగా అందుకు 3,900 కోట్ల రూపాయలు ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించింది.
- మహిళా శక్తి మిషన్. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పం.
- తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలలో అత్యంత కీలకమైన ఉద్యోగ నియామకాల భర్తీకి అత్యంత ప్రాధాన్యత.
- 30 వేల ఏకరాల్లో చారిత్రాత్మకమైన భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం. ఫ్యూచర్ సిటీతో అనుసంధానంగా మచిలీపట్నం పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి.
- తెలంగాణ రైజింగ్ విజన్ 2047 కు అనుగుణంగా, టెక్నాలజీ, ఏఐ, జీసీసీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ స్టార్టప్, ఫైనాన్షియల్ సర్వీస్ సంస్థలకు అధిక విలువైన కేంద్రంగా కోర్ అర్బన్ రీజియన్ అభివృద్ధి పరచడం.

2 లో

# ప్రపంచ దేశాల్లో కలవరం..
## 118 డాలర్లకు చేరిన చమురు ధర

- ఖతార్లోని కీలక రస్ లఫాన్ గ్యాస్ క్షేత్రం సహా చమురు రిఫైనరీలపై ఇరాన్ భీకర దాడులు
- నౌకలపైకీ క్షిపణులు, డ్రోన్లు..ఇజ్రాయెల్ ఉత్తర విద్యుత్ గ్రిడ్ పైనా దాడి..
- ప్రపంచ స్టాక్ మార్కెట్లు భారీ పతనం...పశ్చిమాసియాకు అమెరికా సైనికుల తరలింపు



2 లో

- ఇరాన్ దౌత్యవేత్తలను బహిష్కరించిన ఖతార్
- పలు దేశాల నేతలతో మాట్లాడిన మోదీ

జయభేరి, దుబాయ్:

పశ్చిమాసియా యుద్ధం పతాక స్థాయికి చేరింది. గల్ఫ్‌లోని చమురు, గ్యాస్ క్షేత్రాలపై గురువారం ఇరాన్ చేసిన భీకర దాడులు కల్లోలం రేపాయి. పలు రిఫైనరీలు మంటల్లో చిక్కుకున్నాయి. నౌకలపైనా ఇరాన్ దాడులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్పై వరుస దాడులు చేసింది. అత్యంత కీలకమైన చమురు వ్యవస్థలపై దాడులతో ప్రపంచ దేశాల్లో కల్లోలం రేగింది. బ్యారెల్ ముడి చమురు ధర ఒక దశలో 118 డాలర్లకు చేరింది.



3 లో

## ఇది ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్

- ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పుమోపారు.. కవిత

జయభేరి, హైదరాబాద్ :

రైజింగ్ తెలంగాణ అంటే నిరుద్యోగంలో రైజింగ్ అవుతున్నాం. ఇది ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్ అని తెలంగాణ జాగృతి నేత కవిత అన్నారు. రైజింగ్ తెలంగాణ అంటే నిరుద్యోగంలో రైజింగ్ అవుతున్నాం. 56 శాతం జనాభా ఉన్న బీసీలకు ఇచ్చింది 4 శాతం నిధులే. తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారని అన్నారు. ఎంబీసీ మినిస్ట్రీ, ఎంబీసీలో వెనుబడిన కులాలకు కార్పొరేషన్లు అన్నారు. ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ రాష్ట్రంలో గిరిజన మంత్రి లేని మొదటి ప్రభుత్వం ఇది. మైనార్టీ మంత్రి కూడా మొన్నటి వరకు లేడు. దీనిపై మేము పోరాటం చేస్తే అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చారు. కచ్చితంగా లంబాడా మినిస్టర్ ను కూడా నియమించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇక 22 లక్షల 50 వేల ఇళ్లు కడతామని చెప్పి వాటికి 5,500 కోట్లు మాత్రమే కేటాయించారు. గతే బడ్జెట్ లో 12 వేల కోట్లు కేటాయిస్తే ఈ సారి 7 వేల కోట్లు తగ్గించారు. అందుకే ఇది విజన్ బడ్జెట్ కాదు. రీ విజన్ బడ్జెట్ మాత్రమే అంటున్నా. 20 వేల కోట్లు అప్పులు రీస్ట్రక్చర్ చేసుకునేలా చేశామని ముఖ్యమంత్రి గొప్పలు చెబుతున్నారు. కేంద్రం ఇచ్చే గ్రాంట్ దాదాపు 20 వేల కోట్లు అని గత బడ్జెట్ లో చెప్పారు. వచ్చింది మాత్రం 11 వేల 120 కోట్లు మాత్రమేనని అన్నారు.

# ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యం

- 6 గ్యారంటీల అమలు మోసాన్ని అసెంబ్లీలో ఎండగడతాం - కేటీఆర్
- బాకీ కార్డులతో కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టిన బి.ఆర్.ఎస్
- గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన




జయభేరి, హైదరాబాద్ :

గన్ పార్క్ వద్ద భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యంపై ప్లకార్డులతో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన "బాకీ కార్డులు" ప్రదర్శిస్తూ ప్రజలను మోసం చేసిన విధానాన్ని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ఎండగట్టారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ నిరసనలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా తెలంగాణను ఆగం చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. దివ్యాంగులకు బాకీ పడ్డ రూ.54,000 ఎక్కడ అని నిలదీశారు. నిరుద్యోగులకు హామీ ఇచ్చిన రెండు

...మిగతాది 2 లో



## ఇది ఫ్యూచరిస్టిక్ బడ్జెట్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

జయభేరి, హైదరాబాద్ :

శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఫ్యూచరిస్టిక్ బడ్జెట్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివర్ణించారు. రేవంత్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిచ్చాం. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ఆర్థిక వృద్ధి ని దృష్టి లో పెట్టుకొని మౌలిక వసతుల కల్పనకు సరిపడే నిధుల కేటాయింపు జరిగింది. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి బడ్జెట్ పెద్ద పీట వేసింది. అన్ని రంగాలు, అన్ని వర్గాలకు నిధులు కేటాయించామని అన్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ప్రవేశ పెట్టాం. ఈ పథకం ద్వారా రూ. 5 లక్షల బీమా పరిహారం అందిస్తున్నాం. రాష్ట్రంలోని దాదాపు 1కోటి 15లక్షల కుటుంబానికి ఈ పథకం వర్తించనుందని అన్నారు. విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలకు, ప్రజారోగ్య సంరక్షణకు అత్యధిక నిధులు కేటాయించాం. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో కూడా మార్పులు తీసుకువస్తాం ప్రీ ప్రైమరీ నుంచి ప్లస్ టూ వరకు విద్యార్థులు ఒకే చోట ప్రభుత్వ స్కూల్లో చదివే విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నారు.

అప్పులు, ఆదాయానికి సంబంధించి పారదర్శకంగా అన్ని వివరాలు వెల్లడించాం. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజా ప్రభుత్వం చేసిన అప్పు రూ.3.47లక్షల కోట్లు.ఇందులో నుంచి గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకే 3.30 లక్షల కోట్లు చెల్లించాం. రాష్ట్ర ఆదాయం పెంచుకునేందుకు వివిధ విభాగాల్లో ఉన్న లీకేజీలను అరికడుతున్నాం. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు తెచ్చుకుంటున్నామని అన్నారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## తెలంగాణ బడ్జెట్.. ప్రధాన అంశాలు

- ఓఆర్ఆర్ వెలుపల రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) లోపలున్న మధ్య భాగంలో తయారీ రంగ హబ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యం. ఆర్ఆర్ఆర్ అవతలి భాగంలో ఫుడ్ ప్రాజెసింగ్ పరిశ్రమలు, విలువ ఆధారిత వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి.
- వ్యవసాయ రంగం. రైతులకు పెట్టుబడి సహాయం కోసం రైతు భరోసా పథకం ద్వారా ప్రతి సీజన్‌కు ఎకరాకు 6 వేల చొప్పున రెండు పంటలకు కలిపి ఏటా 12 వేల రూపాయల సహాయం. రైతులకు అండగా నిలవడానికి సన్నవడ్లకు క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్. మొత్తంగా రైతు సంక్షేమం కోసం బడ్జెట్‌లో ప్రతిపాదించింది రూ. 23,179 కోట్లు.
- ప్రజా పంపిణీ వ్యవస్థ. ఆహార భద్రత కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో 3.18 కోట్ల లబ్ధిదారులకు రేషన్ షాపుల ద్వారా 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందించబడుతోంది. 15.12 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. పౌర సరఫరాల శాఖకు రూ. 7,366 కోట్లు.
- విద్యుత్ రంగం కేవలం సరఫరా వ్యవస్థగా కాకుండా సామాజిక న్యాయం, ఆర్థిక వృద్ధి, భావి తెలంగాణకు పునాదిగా భావించింది. రాష్ట్రంలో 23,187 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో, ప్రతి వ్యక్తికి వినియోగం 2508 యూనిట్లు ఉండగా దేశ సగటుకంటే చాలా ఎక్కువగా నమోదైంది. రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ వంటి ఆధునిక వ్యవస్థలను అమలు చేస్తూ నాణ్యతను నిరంతరం పర్యవేక్షణ. ఈ శాఖకు బడ్జెట్‌లో రూ. 21,285 కోట్లు.
- విద్యా రంగానికి రూ. 26,674 కోట్లు. యంగ్ ఇండియా ఇంటిగ్రేడెట్ రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ సమాజం ఒక ఉమ్మడి వసుదైక కుటుంబంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులంతా ఒకేచోట చదువుకునేందుకు వీలుగా అధునాతన వసతులతో రాష్ట్రంలో 105 పాఠశాలలు నిర్మాణం.
- ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి 33 జిల్లాల్లో 1362 ప్రీప్రైమరీ విభాగాలను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి, వచ్చే విద్యా సంవత్సరంలో దీన్ని 2 వేల నుంచి 2500 పాఠశాలలకు విస్తరణ.
- ఏటీసీల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రతి నెల రూ. 2 వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలని నిర్ణయించింది.
- దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నైపుణ్య ఆధారిత బ్లూ కాలర్ ఉద్యోగ అవకాశాలకు అవసరమైన మానవ వనరులను అందించడంలో తెలంగాణ యావత్ ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నది లక్ష్యం.
- వైద్య, ఆరోగ్య రంగానికి రూ. 13,679 కోట్లు. పేద ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి చెందిన దేశాలలో మాత్రమే లభించే ప్రజల హెల్త్ ప్రొఫైల్ తయారు చేయడం.
- రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన 9 ప్రభుత్వ వైద్య కళాశాలల ద్వారా మరో 1980 పడకలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి సనత్‌నగర్, ఎల్‌బీనగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు నిమ్స్ విస్తరణ, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అందులోకి తెస్తాం. కొత్తగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం.
- ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. దీని ద్వారా 23.51 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు లబ్ధి. ఉద్యోగుల భద్రత కోసం తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకం.
- సాగునీటి ప్రాజెక్టులకు రూ. 22,615 కోట్లు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల, జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల, రాజీవ్ భీమా ఎత్తిపోతల, మక్తల్, నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల, ఎస్ఎల్బీసీ, ఉదయ సముద్రం, డిండి, దేవాదుల, సీతారామ, గౌరవెల్లి లాంటి ప్రాజెక్టులతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత - చేవెళ్లను చేపట్టడం.
- రోడ్లు, భవనాల శాఖకు రూ. 12,789 కోట్లు. హ్యామ్ విధానంలో ఆర్ అండ్ బీ రోడ్లను అభివృద్ధికి ప్రతిపాదనలు. రీజినల్ రింగ్ రోడ్డుతో పాటు దానికి సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ఏర్పాటు. నూతన విమానాశ్రయాల అభివృద్ధి.
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ. 17,907 కోట్లు. మూసీ నది పునరుద్ధరణ కోసం మొదటి దశ ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు ఉంటుంది. మూసీ పునరుద్ధరణలో భాగంగా గోదావరి నుంచి 2.5 టీఎంసీ నీటిని తరలించడమే కాకుండా మరో 39 ఎస్టీపీల నిర్మాణం.
- హోం శాఖకు రూ. 11,907 కోట్లు. శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యనత. మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం. నక్సలిజంపై మూలలను విశ్లేషించి యువతకు సరైన జీవనోపాధి, సామాజిక గౌరవం, ఆర్థిక భరోసా కల్పిస్తే సమస్య పరిష్కరించవచ్చన్న నమూనా అమలు.
- పన్నెండేళ్లకు ఒకసారి జరుపుకునే పవిత్ర గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్న నేపథ్యంలో వాటి నిర్వహణ కోసం అత్యద్భుతంగా ఏర్పాట్ల కోసం బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయింపు.
- నూతన క్రీడా విధానంలో భాగంగా రాష్ట్రాన్ని 2047 నాటికి దేశానికి స్పోర్ట్స్ క్యాపిటల్‌గా మార్చేందుకు ప్రణాళికలు. ప్రకటించిన పర్యాటక పాలసీ 2025, 30 కి అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, స్థానిక కళలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యం.
- "ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశా దీపం. అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేసి ఆర్భాటాలకు పోకుండా ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తున్నాం" అని ఆర్థిక మంత్రి భట్టీ విక్రమార్క వివరించారు.
- "తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలను నిజం చేసే సంకల్పపత్రమే ఈ బడ్జెట్. పేదవాడి కన్నీరు తుడిచిన నాడే నిజమైన అభివృద్ధి అన్న మహాత్మాగాంధీ మాటలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఒక సుందరమైన, సుసంపన్నమైన, ప్రశాంతమైన తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించే బ్లూ ప్రింట్ ఈ బడ్జెట్."

## నల్గోండ పట్టణంలో అశా వర్కర్ల అందోళన

✍ జయభేరి, నల్గొండ :

నల్గొండ గడియారం సెంటర్ వద్ద మండు ఎండలో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల నిరసన ట్రాఫిక్ జామ్ కు దారి తీసింది. స్థానిక మంత్రి కార్యాలయం ఇందిరా భవన్ ను సిఐటియు ఆశ వర్కర్ల యూనియన్ ముట్టడించింది. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ఇందిరా భవన్ ముందు నిరసనకారులు బైఠాయించారు. ఆశా వర్కర్లకు రూ. 18,000/ఫిక్స్డ్ వేతనం వెంటనే అమలు చేయాలి. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి. ఆశాల అన్ని సమస్యల పరిష్కారానికి ఎన్ఎహెచ్ఎం కింద తగిన నిధులు కేటాయించాలి.. ఆశా వర్కర్లపై పెరుగుతున్న పనిభారం తగ్గించి, అదనపు భత్యాలు ఇవ్వాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలని అన్నారు. గర్భిణీలు, శిశు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశాలకు ప్రత్యేక గౌరవ వేతనం ఇవ్వాలి. ప్రమాద భీమా, ఆరోగ్య భీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సలీం, దండంపల్లి సత్తయ్య జిల్లా ఉపాధ్యక్షుడు, లకపాక రాజు,పింజర్ల సైదులు, ఆశా కార్యకర్త జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, వెంకటమ్మ, సునీత, సిఐటియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మా.. జీవితాలకంటే... అడ్డమీది బ్రతుకులే నయం...

- మా బ్రతుకులకెప్పుడు సూర్యోదయం....!?
- ఇంటర్ డిగ్రీ ప్రవేట్ అధ్యాపకుల సంగతేంటి...!?
- డిసెంబర్ నెల వస్తే చాలు... అధ్యాపకుల జీవితాల్లో రైళ్లు పరిగెడుతాయి..
- 15 అడ్మిషన్లు గనక తీసుకురాకపోతే జీతాలు ఉండవు...
- కనీసం అలవెన్సు ఇవ్వరు...? పెట్రోల్ డబ్బులు కూడా అందించారు?
- విధిని ఎదిరించి చదువుకున్న విద్యావ్యవస్థ యాజమాన్యాల ముందు మోకరిల్లడమే...
- ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ కాలేజీల లెక్చరర్ల పరిస్థితి... ఒకవైపు.. విద్యావిధానంలో కీలక మార్పులు తెస్తున్నాం



✍ జయభేరి, హైదరాబాద్ :

ఇకపై టెన్త్ పరీక్షలు ఉండవునర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విధానంఅంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా విధానానికి పెద్దపీట వేస్తూ విద్యావ్యవస్థకు ఎక్కువ శాతం కేటాయించిన సంగతి మనం చూస్తున్నాం. కానీ ఇంకో వైపు ఇంటర్ డిగ్రీ ప్రైవేటు కాలేజీల అధ్యాపకుల జీవితం దారుణమైన స్థితికి నెలవుగా మారింది.. విద్యను బోధించే వారికి రోజురోజు వారి జీవన విధానం అడ్డమీది కూలీల బ్రతుకు కంటే దారుణంగా మారిపోతుంది. ఇంటర్, డిగ్రీ లాంగ్వేజ్ లెక్చరర్ల పరిస్థితి ఇక చెప్పనక్కర్లేదు... తమ కాలేజీలలో విద్యార్థులను చేర్పించడానికి అన్నింటికీ తెగించి రోడ్డుమీద పడాల్సిందే.. ప్రవేట్ కాలేజీలలో అడ్మిషన్ల కోసం పదవ తరగతి పరీక్షలు రాస్తున్న వారిని పట్టుకోవడానికి వారి తల్లిదండ్రులను వారి ఇంటి అడ్రస్ వెతుక్కుని మరి అడ్మిషన్ల కోసం నానా పాట్లు పడుతున్నారు ఇంటర్, డిగ్రీ ప్రైవేట్ లెక్చరర్లు...
విద్యను బోధించడానికి మాత్రమే లెక్చరర్లు ఉన్నారు అనుకుంటే పొరపాటే.. వాళ్ల కాలేజీలలో అడ్మిషన్లు నింపడానికి పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుకున్న అధ్యాపకుల జీవితాలు అడ్డమీది కూలీలుగా మారిపోతుంది. దీనికి ప్రధాన కారణం ప్రైవేట్ కాలేజీల యాజమాన్యం. వాస్తవానికి పోస్ట్ గ్రాడ్యుయేట్, సబ్జెక్టుపై ఎమ్మెస్సీ ఇలా ఎన్నో ఉన్నతమైన చదువులు చదువుకొన్న లెక్చరర్లు ప్రభుత్వ ఉద్యోగం దొరకక, ప్రైవేటు కళాశాల యాజమాన్యానికి దాసోహం చేస్తూ, తమ జీవితాన్ని నర్మగర్భంగా నెట్టుకొస్తున్నారు. 12 గంటలు పని చేస్తే అధ్యాపకులకు వచ్చే జీతం ఎనిమిది నుంచి పదివేల రూపాయలు మాత్రమే...
**కాలేజీ లెక్చరర్ గా చేయడం కంటే అడ్డమీది కూలీలుగా పని చేసుకోవడం నయం అనే దశకు ఈ అధ్యాపకులు వస్తున్నారు.. అంటే దానికి ప్రధాన కారణం ఎవరు..? ప్రైవేటు కాలేజీల యాజమాన్యం అత్యాశకు బలి పశువులుగా మారేది కాలేజీ లెక్చరర్లు మాత్రమే... 15 అడ్మిషన్లు తీసుకురాకపోతే వారికి జీతాలే ఉండవట!? అడ్మిషన్లకు కాలేజ్ లెక్చరర్లకు అసలు సంబంధం ఏంటి? అధ్యాపకులు అంటే అంత చిన్న చూపా!? ఇంటింటికి తిరుగుతూ మా కాలేజీలో చేరండి అని అడుక్కుతినే ఆ సాంప్రదాయం ఎక్కడిది? పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుకున్న లెక్చరర్ లను మార్కెటింగ్ మేనేజర్లుగా మారుస్తున్న ఇంటర్ డిగ్రీ ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాన్ని ఏమని ప్రశ్నించాలి? బతకలేక బడిపంతులు ఉద్యోగం అని ఊరికే అనలేదేమో...!? మా కాలేజీలో చేరండి అంటూ ఇంటింటికీ విద్యార్థుల తల్లిదండ్రులను ప్రసన్నం చేసుకోవడానికి వారు పడే పాట్లు మాటల్లో చెప్పలేం... ఒకవైపు విద్యావ్యవస్థలో పెను మార్పులు తీసుకొస్తున్న అని ప్రభుత్వాలు ఎన్ని వాగ్దానాలు చేసిన ప్రైవేటు కాలేజీల యాజమాన్యం వైఖరిని మార్చే విధంగా ప్రభుత్వాలు ముందుకు రావడం లేదు.**
నిజానికి ప్రైవేట్ లెక్చరర్ల సంఘం అంటూ ఏదీ లేకపోవడమే దీనికి ప్రధాన సమస్యగా కనిపిస్తోంది... వీరి సమస్యను పరిష్కరించు కోవడానికి ఏ సంఘాలు, ఏ నాయకులు, ఏ రాజకీయ నాయకుడు ముందుకు రారు.. ఎందుకంటే వీరితో వారికి ఎక్కువగా అవసరం లేనట్టుంది. ఎందుకంటే ఎన్నికల్లో కూడా మా కాలేజీలో పనిచేస్తున్నారు కదా మీరు కచ్చితంగా ఫలానా పార్టీకే ఓటు వేయాలి అనే డిమాండ్ కూడా లేకపోలేదేమో.. ఇక ప్రైవేట్ కాలేజీలో యాజమాన్యం చేసే ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఉదాహరణకు ఒక విద్యార్థి ఐదువేలు కట్టి ఆ ఫలానా కాలేజీలో అడ్మిషన్ కోసం వెళ్లి నచ్చక వేరే కాలేజీలో అడ్మిషన్ తీసుకుంటే కట్టిన 5000 రూపాయలు సదరు ఆ ప్రైవేట్ కాలేజీ యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు ఇవ్వరు... ఇది అందరికీ తెలుసు కానీ ఎవరు దీనిపై పెదవి విప్పరు. ప్రశ్నించరు. ఉన్నత విలువలను వ్యక్తిత్వాన్ని విద్య వ్యవస్థలో బోధించడానికి అధ్యాపకులు నానా పాట్లు పడుతూ పదో తరగతి పాస్ అయిన యువతను తమ వైపు తిప్పుకోవడానికి, విద్యను బోధించే అధ్యాపకులకు ఇక్కట్లు తప్పడం లేదు.
**ఎందుకంటే ప్రైవేట్ ఇంటర్ డిగ్రీ లెక్చరర్లు ఏనాడైనా సంఘాలుగా ఏర్పడి ఉద్యమాలు చేసిన దాఖలాలు ఉన్నాయా!? ఉన్నత విద్యను బోధించే అధ్యాపకుల జీవితాల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. ప్రైవేటు యాజమాన్యాల చేతిలో కీలుబొమ్మలుగా మారిపోతున్నారు. ఉన్నత చదువులు చదువుకొని విద్యార్థులను సరైన దారిలో పెట్టే అధ్యాపకులే ఇంటింటికి తిరిగి మా కాలేజీలో చేరండి మరో అని మార్కెటింగ్ చేసుకునే పరిస్థితి దాపురించింది అంటే అంతకంటే అవమానం ఇంకొకటి ఉండదు. నిజానికి ఇది అధ్యాపకులకు అవమానం మాత్రమే కాదు విద్య వ్యవస్థకే బ్రష్టు పట్టిస్తున్న అంశం. వాస్తవానికి అడ్మిషన్ల కోసం ఎవరు ప్రయత్నించాలి?**
కాలేజీలో అడ్మిషన్ల కోసం మార్కెటింగ్ వ్యక్తులను నియమించుకొని వారి ద్వారా అడ్మిషన్ డిపార్ట్మెంట్లో పని చేస్తున్న అధికారులు ఉద్యోగులు వారు కాలేజీలో అడ్మిషన్ల కోసం ప్రయత్నం చేయాలి. అంతేకానీ విద్యను బోధించే గురువులను తమ పనివారుగా భావించే యాజమాన్యాలు ఉన్నంతసేపు ఈ వ్యవస్థలో ఈ దీనస్థితి మారదు. కొన్ని సంవత్సరాల నుంచి ఈ తప్పుడు దారిలో ప్రైవేటు ఇంటర్ డిగ్రీ కాలేజీల యాజమాన్యం నడుస్తున్న దీన్ని ఎవరు పట్టించుకోవడం లేదు. ఎందుకంటే ఇందులో పని చేస్తున్న అధ్యాపకులు తమ గోడును ఎవరికి చెప్పుకోరు కాబట్టి.
ఎందుకంటే అలా చెప్పుకుంటే మా ఉద్యోగం పోతుందేమోనన్న భయం.. కుటుంబ భారాన్ని మోయలేక ఎన్నో అవమానాలు పడుతూ జీవితాన్ని నెట్టుకొస్తున్నారు..
ఒకవైపు చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత విద్యను బోధించడానికి అర్హత సాధించిన అధ్యాపకులు చివరకు ఉద్యోగంలో చేరిన తర్వాత వారి జీవితం ప్రైవేటు విద్యా వ్యవస్థను నడుపుతున్న వారి చేతుల్లో పూర్తిగా నలిగిపోతుంది. అవమానాలను మోస్తూ, మాటలను భరిస్తూ, వచ్చిన జీతంతో సమాజంలో ఉన్నతంగా గౌరవంగా బ్రతకలేక తమ పిల్లల్ని చదివించుకోలేని స్థితిలో ఇంటర్ డిగ్రీ ప్రైవేట్ కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్ల జీవితానికి అద్దం పడుతుంది..
ఈ వ్యవస్థను మార్చడానికి ఎవరో రానిక్కర్లేదు.. పరిపాలన చేస్తున్న ప్రభుత్వాలు ప్రవేట్ విద్యా వ్యవస్థలో కీలక మార్పులు తీసుకురావాలి. ఒకవైపు ప్రవేటు కాలేజీల యాజమాన్యాలను పెంచి పోషిస్తూ ఇంకోవైపు ప్రభుత్వ బడులను విద్యా విధానాన్ని పూర్తిగా మార్చేస్తున్నామని సంకలు గుద్దుకోవడం కాదు.. తెలంగాణలో విద్యా వ్యవస్థ పూర్తిగా ప్రవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందని అందరికీ తెలుసు కానీ ఎవరు ఒక అడుగు ముందుకు వేయరు.. ముఖ్యంగా ప్రైవేట్ ఇంటర్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల జీవితాల్లో మార్పు తీసుకురాగలగాలి. ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించాలి. ప్రవేట్ ఇంటర్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న లెక్చరులను గురువులుగా భావించి వారికి సముచిత గౌరవాన్ని అందిస్తూ వారి అభివృద్ధి సంక్షేమాన్ని ఈ ప్రభుత్వాలు అందించగలగాలి.



✍ కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

## ప్రపంచ దేశాల్లో కలవరం..

స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ఒక్కరోజులోనే భారత్లో రూ. 12.87 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. మరోవైపు పశ్చిమాసియాకు వేల మంది సైనికులను పంపాలని అమెరికా నిర్ణయించినట్లు వచ్చిన వార్తలు మరింత కలవరం రేపాయి. భూతల పోరు మొదలైతే యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందో అనే ఆందోళనలు పెరిగాయి. ఇప్పటికే అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో చమురు క్షేత్రాలపై దాడులు మరింత వణుకు పుట్టిస్తున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై గురువారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిఖ్, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంలతో ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్లో మాట్లాడారు. ఉద్రిక్తతలు తగ్గాలని, శాంతి, సుస్థిరత నెలకొనాలని ఆకాంక్షించారు. హర్మూజ్ జల సంధిద్వారా నౌకల రవాణా సురక్షితంగా సాగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. చర్చలు, దౌత్యం ద్వారా సమస్య పరిష్కారం గురించి మెక్రాన్తో మాట్లాడినట్లు ఎక్స్లో మోదీ పేర్కొన్నారు.

## ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యం

లక్షల ఉద్యోగాలు ఎక్కడ? నిరుద్యోగ భృతి ఏమైంది? అంటూ ప్రశ్నించారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామని చెప్పిన రూ.24,000లో, సంవత్సరానికి రూ.12,000 చొప్పున రెండు సంవత్సరాలుగా బాకీ ఉందని విమర్శించారు. వృద్ధులకు ఇవ్వాల్సిన నెలకు రూ.4,000 చొప్పున మొత్తం రూ.54,000 బాకీ ఎక్కడ అని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డలకు ఇస్తామని చెప్పిన తులం బంగారం ఏమైందని నిలదీశారు. తెలంగాణ రాష్ట్ర సంపాదనను దోచుకుంటూ రాష్ట్ర ప్రజలను గాలికి వదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "మేము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి, 'అభయహస్తం' మేనిఫెస్టోతో ప్రజలను నమ్మబలికి ఓట్లు దక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇవాళ మూడో బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పటికీ ఆ హామీలకు చట్టబద్ధత కల్పించకుండా, నిధులు కేటాయించకుండా ప్రజలను వంచిస్తోంది. ఈ మోసాన్ని నిలదీయడానికే అమరవీరుల స్థూపం సాక్షిగా ఈ నిరసన చేపట్టాం" అని అన్నారు. "జేమ్స్ బాండ్‌ల మాదిరిగా బాండ్ పేపర్లు రాసిచ్చి, 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా 'గ్యారెంటీ' అన్న మాట లేకుండా, 'డిక్లరేషన్' అన్న మాట లేకుండా ప్రతి వర్గాన్ని వంచిస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు. కేటీఆర్ ప్రభుత్వం పై పలు కీలక అంశాలపై ప్రశ్నలు లేవనెత్తారు. బలహీన వర్గాలకు లక్ష కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి, మూడు బడ్జెట్లు కలిపినా 20 వేల కోట్లకు మించకుండా కేటాయించడాన్ని ప్రశ్నించారు. వృద్ధులు, వితంతువులు ఎదురుచూస్తున్న రూ.4,000 పెన్షన్ ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు 18 ఏళ్లు నిండిన కోటి 58 లక్షల మందికి ఇస్తామని చెప్పిన రూ.2,500 మహాలక్ష్మి పథకం ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5 లక్షల దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్ హామీ అమలు చేయాలన్నారు. రైతులకు రైతు భరోసా పేరుతో రూ.15,000 ఇస్తామని చెప్పి, ఇప్పటికే ఉన్న రైతుబంధునే అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. సంక్రాంతికి రావాల్సిన డబ్బులు ఉగాది దాటినా రాకపోవడం ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. ఉద్యోగాల విషయంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 11,900 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, ఇది యువతను మోసం చేయడమేనని పేర్కొన్నారు. "మీరు రాసిచ్చిన బాండ్ పేపర్లు ఇవాళ నీటి మీద రాతలైపోయాయి. శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో ప్రతి అడుగునా రాష్ట్ర ప్రజల తరపున మిమ్మల్ని నిలదీస్తాం. హామీలు నిలబెట్టుకోకపోతే వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని కేటీఆర్ హెచ్చరించారు.



## సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధికి వారదులు

▶▶ ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి

✍ జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గం కమలానగర్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పరమేశ్వర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి తమను పరిచయం చేసుకున్నారు. కాలనీ అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ తరపున పరమేశ్వర్ రెడ్డికి పలు వినతులు తెలియజేశారు. దీనిపై స్పందించిన పరమేశ్వర్ రెడ్డి కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, కాలనీ అభివృద్ధి కోసం కాలనీ వాసుల సహకారంతో ముందుకు సాగాలని పరమేశ్వర్ రెడ్డి గారు సూచించారు. ఈ కార్యక్రమంలో కమలానగర్ కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దశరథ్, ప్రధాన కార్యదర్శి నవీన్ చౌదరి, కోశాధికారి వెంకటకృష్ణయ్య, సంయుక్త కార్యదర్శి నమ్ముల రమేష్ యాదవ్, ఉపాధ్యక్షులు పార్థసారథి, ముఖ్య సలహాదారులు రాజేశ్వర్, కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు సురేష్, కాలనీవాసులు మురళి పంతులు, సత్య పాల్గొన్నారు.

# ఇది ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్

- ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పుమోపారు.
- బీసీలు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వికలాంగులు అందరినీ మోసం చేశారు.
- బడ్జెట్ లో తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారు
- మోడీ బడే భాయ్ అని ఢిల్లీకి పోయి వంద రూపాయలు కూడా తేలేదు.
- కాంగ్రెస్ నాయకులు ఒకరిని మించి ఒకరు ఫేక్ తున్నారు అందుకే ఇది ఫేక్, ఫేకర్, ఫేకెస్ట్ ప్రభుత్వం.
- రాహుల్ గాంధీ మా హైదరాబాదీ సలీం ఫేక్ లాంటి వ్యక్తి.. సలీం ఫేక్ తన ఫేక్ తో కనీసం ప్రజలను నవ్విస్తాడు.. రాహుల్ మా ప్రజలను ఏడిపిస్తున్నడు
- ఇక నుంచి రాహుల్ గాంధీకి "రాహుల్ ఫేక్" అని నామకరణం చేస్తున్నాం



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్ ప్రవేశపెట్టిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బీసీలు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వికలాంగులు, మైనార్టీల ఇలా అన్ని వర్గాల కు బడ్జెట్ లో అన్యాయం చేశారని అన్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. రైతుభరోసా, చేయూత పింఛన్లు సహా చాలా రంగాలకు గతేడాది కేటాయించిన నిధులనే అక్షరం మార్చకుండా అలాగే కొత్త బడ్జెట్ లోనూ పెట్టారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి కనీస విజన్ కూడా లేదని అందుకే ఇది రివిజన్ బడ్జెట్ అంటున్నామని మండిపడ్డారు. ఏటా బీసీలకు రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామంటూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఫేకారని.. కానీ బడ్జెట్ లో మాత్రం 4 శాతం నిధులే కేటాయించి బీసీలను మోసం చేశారన్నారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం మంది ఉన్న బీసీలకు 4 శాతం నిధులు ఇవ్వడం ఏమిటని నిలదీశారు.
లక్షల కోట్లు అప్పులు తెస్తున్న రేవంత్ సర్కార్ ఆ డబ్బులను ఏం చేస్తుందని ప్రశ్నించారు. దాదాపు 8 లక్షల 64 వేల కోట్లు అప్పు చేసి ప్రతి ఒక్కరి తలపై రూ. 2 లక్షల 16 వేల భారం మోపారన్నారు. ఒక్కో కుటుంబంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.9 లక్షల అప్పుల భారం మోపిందన్నారు. లక్షల కోట్ల అప్పులు తెచ్చినా ప్రజలకు మాత్రం పైసా మేలు జరగలేదన్నారు. మోడీ తన బడే భాయ్ అంటూ ఎన్నోసార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా ఎందుకు తేలేదో చెప్పాలని నిలదీశారు. ప్రజలకు మేలు చేయటం చేతకాని కాంగ్రెస్ నాయకులు ఒకరిని మించి ఒకరు ఫేక్ తున్నారని మండిపడ్డారు. అందుకే ఇది ఫేక్, ఫేకర్, ఫేకెస్ట్ ప్రభుత్వమని కవిత విమర్శించారు.

**రాహుల్ ఫేక్**

ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చి పెద్ద ఎత్తున హామీలిచ్చిన రాహుల్ గాంధీపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ఇచ్చిన హామీలన్నీ కూడా ఫేకే అన్నారు. హైదరాబాద్ లో సలీం ఫేక్ అనే నటుడి మాదిరిగానే రాహుల్ గాంధీ కూడా ఫేక్ మాటలు చెబుతుంటాడని విమర్శించారు. అందుకే ఇక నుంచి రాహుల్ గాంధీకి రాహుల్ ఫేక్ గా నామకరణం చేస్తున్నామన్నారు. సలీం ఫేక్ తన మాటలతో నవ్విస్తే...రాహుల్ గాంధీ మాత్రం తెలంగాణ ప్రజలను ఏడిపిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణకు ఎప్పుడు వచ్చిన సరే ఆయన ఇచ్చిన హామీలపై నిలదీస్తామన్నారు.

**నిరుద్యోగంలో రైజింగ్**

బడ్జెట్ లో తెలంగాణ ఉద్యమకారులను ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. మహిళలకు రూ.2,500 ఇస్తామన్న స్కీం ఈసారి కూడా పత్తా లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గతేడాదితో పోల్చితే రూ.7 వేల కోట్లు కోత పెట్టారని అన్నారు. సింగరేణి, ట్రాన్స్, జెన్ కో లకు ఇవ్వాల్సిన 1.50 లక్షల కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త ఉద్యోగాల నియామకాలకు ఎలాంటి కేటాయింపులు లేవని, ఉద్యోగులు, పెన్షనర్లకు బడ్జెట్ లో ఎలాంటి కొత్త కేటాయింపులు లేవన్నారు. కమీషన్లు వచ్చే యంగ్ ఇండియా స్కూళ్లకు మాత్రం రూ.5 వేల కోట్లు కేటాయించారని కానీ టీచర్ల రిక్రూట్ మెంట్ లేకుండా స్కూల్స్ నిర్మించి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు.
వరల్డ్ బ్యాంక్ ను మన భూములు ధారాదత్తం చేసే మూసీ ప్రాజెక్టుకు నిధులు కేటాయించారని అన్నారు. 3.24 లక్షల కోట్ల బడ్జెట్ లో క్యాపిటల్ ఎక్స్ పెండీచర్ కేవలం రూ.50 వేల కోట్లలోపేనని ఇలాగైనా సంపద సృష్టి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. రెవెన్యూ సర్ ప్లస్, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లలో అంచనాలను పెంచి ప్రజలను మోసం చేశారని కవిత అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం అన్నింటికి మించిన ఫేక్ అన్నారు.
తెలంగాణ రైజింగ్ అంటూ ముఖ్యమంత్రి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుంటారని కానీ నిరుద్యోగంలో మనం రైజింగ్ అవుతున్నామని కవిత చెప్పారు. స్టేట్ ఆఫ్ వర్కింగ్ అనే సర్వే సంస్థ చేసిన సర్వేలో తెలంగాణలో పెద్ద ఎత్తున నిరుద్యోగం ఉందని తేలిందని చెప్పారు. మహిళల విషయంలో 50 శాతం నిరుద్యోగిత రేటు ఉండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఇక ఆహారం కల్తీ విషయంలోనూ ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. స్త్రీ నిధి విభాగంలో 14 ఏళ్లుగా ఓ దయ్యం ఉందన కవిత అన్నారు. జి. విద్యాసాగర్ రెడ్డి అనే వ్యక్తి గత బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలను మేనేజ్ చేసి ఇప్పటికీ ఉద్యోగంలో కొనసాగుతున్నారన్నారు. అతను చేసే అక్రమాలపై విచారణ కమిషన్ వేసినప్పటికీ ఇప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. వెంటనే మంత్రి సీతక్క ఎంక్వైరీ చేయించి విద్యాసాగర్ ను తొలగించాలని డిమాండ్ చేశారు.
యంగ్ స్కిల్స్ యూనివర్సిటీ గురించి బడ్జెట్ లో గొప్పలకు పోయారని.. ఆ సంస్థ వెబ్ సైట్ లో 64 వేల మంది ఎన్ రోల్ చేసుకున్నట్టుగా ఫేక్ ప్రచారం చేసుకుంటున్నారని.. వాస్తవానికి స్కిల్ యూనివర్సిటీలో ఎన్ రోల్ చేసుకున్నది 960 మంది మాత్రమేనని అన్నారు. వెంటనే యూనివర్సిటీ వెబ్ సైట్ లోని తప్పుడు సమాచారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలపైనా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు. కేవలం 13 వేల ఉద్యోగాలు భర్తీ చేసి 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. తాము ప్రజా బడ్జెట్ లో లేవనెత్తిన కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలు ఈ బడ్జెట్ లో ప్రతిఫలివంచలేదన్నారు. మైనార్టీలు, దివ్యాంగుల సంక్షేమానికి ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేవన్నారు. బడ్జెట్ లో కేటాయింపులు చేయకున్నా, రివైజ్డ్ ఎస్టిమేట్స్ లో అవకాశం దక్కని రంగాలకు ప్రాధాన్యత ఇవ్వచ్చని ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్ కు భారీ షాక్

- ఉప్పల్ నియోజకవర్గంలో బీర్ఎస్ పార్టీ వీడుతున్న నేతలు, కార్యకర్తలు
- కాంగ్రెస్ లో భారీ ఎత్తున చేరికలు

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ కు భారీ షాక్ తగిలింది. లక్ష్మీనారాయణ కాలనీ బిఆర్ఎస్ నాయకులు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో భారీ సంఖ్యలో చేరారు. పార్టీలో చేరిన వారికి పరమేశ్వర్ రెడ్డి, పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.
సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అమలతో అన్ని పార్టీల దృష్టి కాంగ్రెస్ వైపు మళ్లిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు, ఉప్పల్ డివిజన్ లక్ష్మీనారాయణ కాలనీ పెద్దలు రాములు, సత్తయ్య, వెంకటయ్య, బిక్షపతి, సత్యనారాయణ, రఘుపతి రెడ్డి, ప్రశాంత్, నరేష్, జాకర్, లింగాచారి, భాస్కర్ రెడ్డి, లక్ష్మణ్, బొడ్డు రఘు, ఉప్పల్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లూకాస్, వెంకట్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కంది శ్రవణ్ రెడ్డి, గణేష్ నాయక్, ఉపేందర్ రెడ్డి, ఆగం రెడ్డి, మొలకలపల్లి రాజేష్ ముదిరాజ్, సుంకు శేఖర్ రెడ్డి,విజయకుమార్, బాలయ్య బాబు,కిషన్ నాయక్, సత్తిరెడ్డి, రాజన్న, ధర్మేందర్ నాయక్, జంగయ్య, వాసు నాయక్, సుమన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# క్రీడా ప్రోత్సాహకుడు సీఎం రేవంత్

- క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న రేవంత్ సర్కార్
- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి
- క్రీడలకు 500 బడ్జెట్ కేటాయింపు
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**జయభేరి, హైదరాబాద్ :**




సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత లభిస్తుందని దానికి నిదర్శనమే బడ్జెట్లో అత్యధిక కేటాయింపులు జరుగుతున్నాయని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ బడ్జెట్లో 646రూపాయలు కోట్లు కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు క్రీడాకారులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ,సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో క్రీడలకు ఎనలేని ప్రాధాన్యత లభిస్తోందని, పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో క్రీడలకు మొత్తం కలిపి 150 కోట్లు కేటాయింపులు కూడా సరిగా జరగలేదని, కానీ సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మొదటి సంవత్సరం 360 కోట్లు రెండవ సంవత్సరం 4 26 కోట్లు మూడవ బడ్జెట్లో 646 కోట్లు కేటాయింపులు జరగడం హర్షనీయమని అన్నారు. పెరిగిన క్రీడల బడ్జెట్ తో రాష్ట్రంలో క్రీడా అకాడమీలు నెలకొల్పడం స్పోర్ట్స్ కోళ్లు సంఖ్య పెంచడము అకాడమీలు స్కూళ్లలో నాణ్యత గల క్రీడా శిక్షణ అందించడం నియోజకవర్గ కేంద్రాల్లో స్టేడియాల నిర్మాణం వివిధ క్రీడా కార్యక్రమాల కొరకు బడ్జెట్ ను వినియోగించడం చేస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి క్రీడా ప్రోత్సాహక విధానాలతో రాష్ట్రంలో యావత్ క్రీడా సమాజం సంతోషం వ్యక్తం చేస్తుందని, క్రీడలకు అధిక బడ్జెట్ కేటాయింపులు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు సుజాత రవీందర్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు రవికుమార్, గోకుల్, మధు పిఆర్ఓ కాలేరు సురేష్ ఎల్బీ స్టేడియం కోచ్లు సిబ్బంది క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కేతపల్లి మండలంలో మట్టి మాఫియా కార్యకలాపాలు

- అడ్డొస్తే అంతేనంటూ బెదిరింపులు

**జయభేరి, నల్గొండ :**

నల్లగొండ జిల్లాలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. నిబంధనలను తుంగలో తొక్కి.. అనుమతులు లేకపోయినా అక్రమార్కులు భూమాత గర్భాన్ని చీల్చేస్తున్నారు.కేతపల్లి మండలం కొండకింది గూడెం గ్రామం ఇప్పుడు అక్రమ మట్టి మైనింగ్కు అడ్డాగా మారింది. జెసిబిలతో మట్టిని తవ్వుతూ, టిప్పర్లతో నకిరేకల్ ప్రాంతానికి తరలిస్తూ దళారులు కాసుల కక్కుర్తి పడుతున్నారు. అయితే, ఈ అక్రమాలను ప్రశ్నించిన స్థానికులపై గద్దపాటి సైదులు అనే వ్యక్తి దాడులకు తెగబడుతుండటం ఇప్పుడు కలకలం రేపుతోంది. అక్రమ మైనింగ్ వద్దకు ఎవరైనా వెళ్తే చంపేస్తామంటూ బెదిరించడమే కాకుండా, నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
పెద్ద పెద్ద గొయ్యిలు తీసి పర్యావరణానికి ముప్పు తెస్తున్నా.. అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ మరియు పోలీస్ యంత్రాంగం స్పందించి, కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరి ఈ మట్టి దందాపై అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో చూడాలి.



# తెలంగాణ బడ్జెట్ అంకెల గారడీ మాత్రమే

## సామాన్యుడికి ఒరిగిందేమీ లేదు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

తెలంగాణ బడ్జెట్ 2026 పై ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్న కొన్ని కఠిన నిజాలు. భారీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం... అమలులో మాత్రం పూర్తిగా విఫలం. రైతులకు న్యాయం లేదు - రుణమాఫీ, మద్దతు ధరలపై స్పష్టత లేని బడ్జెట్. మహిళలకు, యువతకు చెప్పిన సంక్షేమ పథకాలపై సరైన కేటాయింపులు కనిపించడం లేదు. ఉద్యోగాల భర్తీపై మాటలు మాత్రమే... ఖాళీలు భర్తీకి స్పష్టమైన ప్రణాళిక లేదు. అభివృద్ధి కంటే అప్పుల భారమే ఎక్కువ - రాష్ట్రాన్ని ఋణాల దిశగా నడిపించే బడ్జెట్. మౌలిక వసతుల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం లేకపోవడం ఆందోళనకరం. ఇది ప్రజల ఆశలను నెరవేర్చే బడ్జెట్ కాదు... కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు విరుద్ధంగా, తెలంగాణ భవిష్యత్తును అనిశ్చితిలోకి నెడుతున్న బడ్జెట్.

# చెరువులో మునిగి యువకుడు మృతి

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డంపింగ్ యార్డ్ దగ్గర గల ఈదుర్ల చెరువు లో, గొర్రెలను శుభ్రం చేసేందుకు వెళ్లిని నిఖిల్ (17) అదుపుతప్పి చెరువులో పడి చనిపోయాడు. ఎండాకాలం కావడంతో ఒంపు గూడ ప్రాంతానికి చెందిన నిఖిల్ తన స్నేహితులతో పాటు సరదాగా చెరువు దగ్గరకు గొర్రెలను తీసుకొచ్చి గొర్రెలను నీటితో శుభ్రం చేస్తుండగా సంఘటన జరిగింది. స్నేహితుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న జవహర్ నగర్ పోలీసులు, హైడ్రా సిబ్బంది, కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ కి తరలించారు.



# ఉప్పల్ ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

**జయభేరి, ఉప్పల్ :**

హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువును ఖాళీ చేసి పనులు ప్రారంభం పట్ల నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, బారాస నాయకులు సంతోషం వ్యక్తం చేస్తూ హెచ్ఎంటి నగర్ చెరువు కట్టపై ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఉప్పల్ నల్లచెరువు వద్ద జరుగుతున్న పనులలో రిటైనింగ్ వాల్ నిర్మాణంలో ఉందని అందువల్లనే ఎక్కువ నీళ్లు వదల లేకపోయామని తొందరలోనే రిటైనింగ్ వాల్ పూర్తి కాగానే చెరువులో నుండి నీళ్లు పెద్ద మొత్తంలో ఖాళీ అయ్యేలా గేట్లు తెరుస్తామని అధికారులు మాజీ కార్పొరేటర్ కు తెలియజేశారు. ఇచ్చిన మాట ప్రకారం పనులు ప్రారంభించినందుకు ఉప్పల్ శాసనసభ్యులు శ్రీ బండారి లక్ష్మారెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేయడమైనది. తొందర్లోనే పటేల్ కుంట చెరువు కూడా సుందరీకరణ పనులు చేపడతామని మాజీ కార్పొరేటర్ తెలియజేశారు అప్పటివరకు పటేల్ కుంట చెరువులోని గుర్రం యొక్క తొలగించే పనులు తక్షణమే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బారసా నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున గౌడ్, విట్టల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, మారయ్య మక్తల శేఖర్ గౌడ్, సంఘం యాదగిరి, చంద్రశేఖర్, సుగుణాకర్ రావు, జయరాజ్ వాసు ఈశ్వర్, నరసింహ, రాజేష్ గౌడ్, వెంకట రెడ్డి, వీరాంజనేయులు, రోహిత్, జహీర్, కిరణ్, స్వామి, ఫారూఖ్, ముదసిర్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు

# బీరప్ప టెంపుల్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

- తోటకూర వజ్రెష్ యాదవ్





**జయభేరి, ఘట్కేసర్ :**

మేడ్చల్ నియోజకవర్గం మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్, రాంపల్లిలో నిర్వహించిన బీరప్ప టెంపుల్ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ హాజరై టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువత ప్రతిభ వెలుగులోకి వస్తుందని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి ఇవి దోహదపడతాయని అన్నారు. టోర్నమెంట్ లో పాల్గొంటున్న క్రీడాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, విజయం సాధించేందుకు క్రీడాస్ఫూర్తితో ఆడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహకులు, క్రీడాకారులు, యువకులు, అభిమానులు, ప్రాంతీయ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు

- గుబ్బరి గట్టు మైసమ్మ,ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్నసింగిరెడ్డి పద్మారెడ్డి



**జయభేరి, మేడిపల్లి :**

మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి ఆహ్వానం మేరకు మేడ్చల్ నియోజకవర్గం ఘట్కేసర్ సర్కిల్, పోచారం డివిజన్ పరిధిలోని ప్రతాపసింగారంలో నిర్వహించిన శ్రీశ్రీ గుబ్బరి గట్టు మైసమ్మ ఎల్లమ్మ దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలలో ముఖ్య అతిథులుగా మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్, బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి హాజరయ్యారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# లారీలో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం స్వాధీనం

- ముగ్గురు అరెస్ట్, లారీ సీజ్

**జయభేరి, మహబూబాబాద్ :**

జిల్లా టాస్క్ ఫోర్స్, కురవి పోలీస్ సంయుక్త ఆపరేషన్లో భాగంగా అక్రమ సారాయి తయారీకి ఉపయోగించే నల్లబెల్లం రవాణాపై చర్యలు చేపట్టారు. చిత్తూరు నుండి మహబూబాబాద్ వైపు అక్రమంగా తరలిస్తున్న లారీని కురవి శివారు సోమ్లా తండా సమీపంలో ఆపి తనిఖీ చేయగా, అందులో సుమారు ₹8,00,000 విలువైన 70 క్వింటాళ్ల నల్లబెల్లం మరియు 10 క్వింటాళ్ల పట్టిక స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులు గుగులోత్ సుమన్, ఆరెపల్లి మధు, బొల్లా విజయ్ కుమార్ లను అరెస్ట్ చేసి, లారీని సీజ్ చేసారు. ఈ ఆపరేషన్లో టాస్క్ ఫోర్స్ సిఐ హతీరామ్, ఎస్సై తాహేర్ బాబా, కురవి ఎస్సైగంద్రాతి సతీష్, ఎస్సై జయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజల భద్రతే మా మొదటి ప్రాధాన్యం

- **ప్రజల సేవలో నాయకులు – ప్రజల భద్రతలో పోలీస్ శాఖ**
- **మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో నూతన SHOతో మర్యాదపూర్వక సమావేశం**

**జయభేరి, మేడిపల్లి :**

పీరజాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నియమితులైన SHO CH. శంకరయ్యని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ సమస్యలు, ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణపై విస్తృతంగా చర్చించారు. పోలీస్ శాఖతో సమన్వయం పెంచుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడిపల్లి హనుమాన్ దేవాలయ చైర్మన్ గడ్డం రామ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు నవీన్ రెడ్డి, అనంత్ రెడ్డి, సుభాష్ నాయక్, యుగేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుచ్చి యాదవ్, బండారి రవీందర్, ఈశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు దుర్గ, హనుమాన్ దేవాలయ ప్రతినిధి ప్రశాంత్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, యువ కాంగ్రెస్ నాయకుడు పవన్. ఈ సందర్భంగా అమర్ సింగ్ మాట్లాడుతూ.. "ప్రజల భద్రతే మా మొదటి ప్రాధాన్యం.. పోలీస్ శాఖతో కలిసి పనిచేస్తూ మేడిపల్లి ప్రాంతంలో శాంతి, భద్రతలను మరింత బలోపేతం చేయడానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాం. ప్రజల సమస్యల పరిష్కారంలో సమన్వయం చాలా ముఖ్యమైనది."

## గ్రామాభివృద్ధికి అంబేద్కర్ మార్గమే మార్గం

- **అంబేద్కర్ ఆశయాలతో గ్రామాభివృద్ధి చేయాలి: కౌన్సిలర్ వెంకటేష్**



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 20:**

మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామంలో నూతనంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. కాగా ఈ విగ్రహ ఏర్పాటుకు గాను తన వంతు సహాయంగా కౌన్సిలర్ గూదే వెంకటేష్ 5000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఇందులో భాగంగా తన వంతు సహాయంగా ఆర్థిక సాయం అందించినట్లు ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుచుకొని గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు.

## ఘనంగా చామకూర మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 20:**

మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తనయుడు, నియోజకవర్గ బిఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి తన జన్మదిన వేడుకలను అభిమానులు, కార్యకర్తల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు తీసుకువచ్చిన కేక్ ను కట్ చేయగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, అదేవిధంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట మండల బిఆర్ ఎస్ పార్టీ నాయకులు వంగ వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీటీసి మహంకాళి అనిత లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి ముందస్తుగా పెద్ద రామాలయం యూత్ స్వచ్ఛ భారత్ కార్యక్రమం



**జయభేరి, దేవరకొండ :**

శ్రీరామనవమి ను పురస్కరించుకుని దేవరకొండ పెద్ద రామాలయం యూత్ ఆధ్వర్యంలో పెద్ద రామాలయం గుడిలోపల స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7:30 నుంచి 10:30 వరకు జరిగిన ఈ కార్యక్రమంలో యువత చురుకుగా పాల్గొని గుడి పరిసరాలను శుభ్రపరిచి భక్తులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో నక్క అన్వేష్ యాదవ్, వర్థం పృథ్వీరాజ్, వర్థం శివరామ్, నక్క రోహిత్, మిక్కీ, ఇట్కల వరుణ్, దండిగా గణేష్, సుహాస్, లోకేష్, జిన్నా భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నేత్ర పర్వంగా ఊంజల్ సేవ

- **శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి నిత్యరాబడి రూ.22.39 లక్షలు**

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 20:**



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో శ్రీ ఆండాల్ అమ్మవారికి ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో శ్రీపాంచరాత్రాగమన ప్రకారం కొండపైన అద్దాల మండపంలో ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

**యాదగిరీశుడికి నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీ సత్య నారాయణస్వామి వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీ లక్ష్మి నారసింహుడికి నిత్యరాబడి..**

శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారికి శుక్రవారం నిత్య రాబడిలో భాగంగా రూ.22,39,757 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,67,400, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,79,100, శ్రీసత్య నారాయణ వ్రతాల ద్వారా రూ.1,43,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.2,40,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.4,04,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.74,748, ప్రసాద విక్రయం ద్వారా రూ.8,29,370, కల్యాణకట్ట ద్వారా రూ.45,000తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

**యాదగిరీశుడికి విరాళం..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయానికి పాలమూరు సీడ్స్ సుదర్శన్ రెడ్డి దంపతులు రూ.6 లక్షలు రూపాయలు విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్‌కు విరాళం చెక్కును అందజేశారు.



## మిస్ ఇన్ఫినిటీ ఆఫ్ ఇండియా 2026 కిరీటాన్ని దక్కించుకున్న శ్రీరంగం దీప్తి

**జయభేరి, హైదరాబాద్ :**

మన మార్కాపురం వాసి అయిన శ్రీరంగం నరసింహచార్యులు అనురాధ దంపతుల కుమార్తె అయిన చిరంజీవి శ్రీరంగం దీప్తి హైదరాబాదులో నిర్వహించిన మిస్ ఇన్ఫినిటీ ఆఫ్ ఇండియా 2026 కిరీటాన్ని దక్కించుకున్నారు. 500 మంది పైగా పోటీదారులు పాల్గొన్న ఈ ఫ్యాషన్ షోలో విజేతగా నిలచి ప్రముఖ సినీ సంగీత దర్శకులు కోటి చేతుల మీదుగా మూడు లక్షల రూపాయల ప్రైజ్ మనీని, అవార్డుని, కిరీటాన్ని అందుకున్నారు. గ్రామీణ వాతావరణం కలిగిన వెనుకబడిన ప్రాంతం నుంచి ఈ పోటీలలో పాల్గొని విజేతగా నిలవడం సాహసోపేతమే... మన మార్కాపురం జిల్లాకు ఇటువంటి అవార్డు దక్కడం శుభ పరిణామం. మహిళా సాధికారికత, ఆత్మవిశ్వాసం, భారతీయ ఐక్యతకు, ఇంటలిజెన్స్‌కి ప్రత్యేకంగా నిలిచే ఇటువంటి మరెన్నో గొప్ప షోలలో పాల్గొని విజేతగా నిలవాలని చిరంజీవి శ్రీరంగం దీప్తిని ఆశీర్వదిస్తూన్నారు.

## రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

- **ప్రేమ, శాంతి, దానగుణానికి నిదర్శనం రంజాన్**
- **జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయి**



**జయభేరి, దేవరకద్ర :**

రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయి కోరారు. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ నెల రోజుల పాటు ఎంతో నిష్ఠతో ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు చేశారన్నారు. శనివారం జరిగే రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని ఆయన అన్నారు. రంజాన్ పండుగను దేవరకద్ర నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా జరుపుకోవడం ఇక్కడి ప్రజల ఐకమత్యానికి ప్రతీక అన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉందని, పవిత్ర రంజాన్ మాసం పరస్పర ప్రేమ, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని, ముస్లిలందరూ రంజాన్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు అత్యంత నిష్ఠతో అల్లాను ప్రార్థిస్తారని తెలిపారు. ఆత్మీయతకు మారుపేరైన రంజాన్ ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. దేవరకద్ర నియోజకవర్గ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# రాబోయే ఎన్నికలలో చాల మంది పద్మశాలి కార్పొరేటర్లు గెలవాలి

- **గెలిపించిన ప్రజలకు మీరు ప్రజాసేవ చేసి ప్రజల మన్నులను పొందాలని**

**జయభేరి, కరీంనగర్ :**




కరీంనగర్ పట్టణ పద్మశాలి సంఘం గడ్డం శ్రీరాములు అధ్యక్షులు ఆధ్వర్యంలో గురువారం ఉగాది పర్వదినం రోజున సా:4:00లకు పంచాంగ శ్రవణం, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్లుగా ఎన్నుకోబడిన పద్మశాలి కుల బాంధవులకు సన్మాన కార్యక్రమం కరీంనగర్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి పట్టణ సంఘ భవనంలో సన్మాన కార్యక్రమము ఏర్పాటు చేయడం జరిగినది. ముఖ్య అతిథులుగా కరీంనగర్ RDO కుందారపు మహేశ్వర్, ఖమ్మం RDO నక్క శ్రీనివాస్, కరీంనగర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కట్ల వేణుమాధవ్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మామిడాల సురేందర్ SI హాజరైనారు. నూతనంగా గెలిచినటువంటి పద్మశాలి కార్పొరేటర్లు వాసాల రమేష్ 17వ, చొప్పరి జయశ్రీ 12వ డివిజన్, తేల లక్ష్మి రమేష్ 13వ డివిజన్, వేముల కవిత చంద్రశేఖర్ 18వ డివిజన్, మాసం గణేష్ 39వ డివిజన్ ఐదుగురు ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. 66 డివిజన్లో ఆరుగురు గెలవడం చాలా గ్రేట్ మిమ్ములను గెలిపించిన ప్రజలకు మీరు దగ్గరై ప్రజా సేవ చేసి ప్రజల మన్నులను పొందాలని మిమ్ములను గెలిపించిన ప్రజల మన్నలను పొందాలని కోరుతూ.. రాబోవు కాలంలో మరొక్కసారి కార్పొరేటర్లుగా గెలవాలని వారు మాట్లాడినారు. రాబోయే ఎన్నికలలో చాల మంది పద్మశాలి కార్పొరేటర్లు గెలవాలని ఆ విధంగా మీరందరూ పనిచేయాలని పట్టణ పద్మశాలి సంఘానికి సూచించినారు. అతిథులుగా కరీంనగర్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మెతుకు సత్యం, జిల్లా పోప సంఘం అధ్యక్షులు పోలు సత్యనారాయణ, జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గుడిమల్ల శ్రీకాంత్, పోప ప్రధాన కార్యదర్శి ఎలిగేటి మల్లికార్జున్, పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి వంగర ఆంజనేయులు, కోశాధికారి గజవెల్లి కనకయ్య, ఉపాధ్యక్షులు తేల్ల చంద్రశేఖర్, వెల్దండి కనకయ్య, ఎలిగేటి శ్రీనివాస్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొరండ్ల రమేష్, ఊషకోయిల సుజాత, కార్యదర్శి బొల్లి రవి, కస్తూరి వాసు, ఆడెపు మునిందర్, మాసం సుధాకర్, బొల్లబత్తిని రవీందర్, వెనుగంటి సందీప్, తదితరులు పాల్గొన్నారు.

# సేవా భావాన్ని చాటుతున్న అంబలి కేంద్రం

- **నారాయణపేట జిల్లాలో 42 ఏళ్లుగా కొనసాగుతున్న అంబలి సేవ**
- **ప్రతి ఏడాది 100రోజుల పాటు కొనసాగనున్న అంబలి కేంద్రం**
- **కీర్తిశేషులు తీలేరు మాజీ సర్పంచ్ వెంక రెడ్డి, మాజీ సర్పంచ్ వజ్రమ్మ, మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్, మాజీ డిసిసిబి, మాది ఆప్కాబ్ చైర్మన్ వీరారెడ్డిల జ్ఞాపకార్థం అంబలి కేంద్రం ప్రారంభం**

**జయభేరి, దేవరకద్ర :**





నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేరు స్టేజ్ వద్ద గత 42 సంవత్సరాలుగా అంబలి కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగానే మళ్ళీ ఇప్పుడు తీలేరు గ్రామ స్టేజ్ వద్ద కీర్తిశేషులు మాజీ సర్పంచ్ కె. వెంక రెడ్డి, కీర్తిశేషులు మాజీ సర్పంచ్ వజ్రమ్మ మరియు కీర్తిశేషులు మాజీ శాసనసభ్యులు, మాజీ విప్, మాజీ డిసిసిబి & మాజీ ఆప్కాబ్ చైర్మన్ శ్రీ వీరా రెడ్డిగార్ల జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం 100 రోజుల పాటు కొనసాగుతున్న ఈ అంబలి కేంద్రం తీలేరు గ్రామ స్టేజ్ వద్ద ఏర్పాటు చేయబడుతూ, ఆ ప్రాంతం గుండా ప్రయాణించే బాటసారులకు మరియు సమీప గ్రామాల ప్రజలకు దాహం తీర్చే గొప్ప సేవగా నిలుస్తోంది.

ఈ ఏడాది అంబలి కేంద్ర ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి, తీలేరు గ్రామ మాజీ సర్పంచ్ రేవతమ్మ, విహాన్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ చైర్మన్ గొల్ల కృష్ణయ్య, జిల్లా పంచాయతీ సంఘటన అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రాములు, యూత్ కాంగ్రెస్ ధన్వాడ అధ్యక్షులు రాజు, అనిల్, నరసింహ, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అరవింద్, సంతోష్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ భద్రప్ప, రాములు, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, వెంకట రాములు, రామచంద్రి, రాము, రాంచందర్, నరసింహ, ప్రభాకర్, కురుమన్న, సలీం, రాజు, బలరాం, బంగారు శీను తదితర ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ అంబలి కేంద్రం గ్రామీణ సేవకు ప్రతీకగా నిలుస్తూ, ప్రజల దాహాన్ని తీర్చడమే కాకుండా సేవా భావాన్ని కూడా చాటుతోంది.

## ఆకాశంలో కనిపించిన నెలవంక

- **నేడే రంజాన్ పండుగ**
- **ముస్తాబైన ప్రార్థన స్థలాలైన ఈద్గాలు**

**జయభేరి, దేవరకద్ర :**



ఆకాశంలో నెలవంక చంద్రుడు కనిపించడంతో శనివారం మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఆకాశంలో నెలవంక చంద్రుడు కనిపించినప్పటి నుండి ప్రారంభమైన ముస్లిం సోదరుల ఉపవాస దీక్షలు ప్రతి ఏడాది మళ్లీ ఆకాశంలో నెలవంక చంద్రుడు కనిపించే వరకు కొనసాగుతాయి. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా కఠోర నియమాలతో కూడిన నెల రోజుల ఉపవాస దీక్షలను ముస్లిం సోదరులు పూర్తి చేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని మహబూబ్ నగర్ జిల్లాలోని ఆయా గ్రామాలలోని ప్రార్థన స్థలాలైన ఈద్గాలను వెళ్ళవేసి ముస్తాబు చేశారు. పరిసరాలను శుభ్రం చేశారు. పండుగ రోజు ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి ఊరేగింపుగా ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. తమ యోగక్షేమాల కోసం దేవుని (అల్లా హ్) ను వేడుకుంటారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుతారు. అలాగే సమీపంలోని స్మశాన వాటికల వద్దకు వెళ్లి మృతి చెందిన తమ వారిని నరకాగ్ని నుండి కాపాడాలంటూ దేవుడ్ని వేడుకుంటారు. అనంతరం ఇండ్ల వద్దకు వచ్చి పండగ ప్రత్యేక వంటకమైన తీపి వంటకాలను ఆరగిస్తారు. కుల మతాలకతీతంగా భోజనాల కోసం అందర్నీ ఆహ్వానిస్తారు. వారిని కూడా పండగ శుభాకాంక్షలు తెలుపుతారు. పురస్కరించుకొని ఆయా పట్టణాలలో ఉన్న మార్కెట్లు ముస్లిం సోదరులతో కిటకిట లాడాయి.

# పోతాయిపల్లిలోని పాఠశాలకు పునర్జీవనం

- పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ముందుకొచ్చిన ఎన్ సి ఆర్ వోయిక్స్, హవిన్ హోల్ సంస్థ ప్రతినిధులు
- సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 20:**



పోతాయిపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పునరుద్ధరణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోతాయిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్సిఆర్ వోయిక్స్ (ఎన్ సి ఆర్ వోయిక్స్, హవిన్ హోల్), హైదరాబాద్, హావిన్ హోల్ (హోవెన్ హోల్), బెంగుళూరు సంస్థల ప్రతినిధులు శ్రీధర్, విశ్వనాథ్, నంది, జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి, మండల విద్యాధికారి కమలాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంధ్య, పలువురు ప్రముఖులు హాజరై లాంఛనంగా ప్రారంభించారు. అయితే ఈ పాఠశాల అభివృద్ధి కోసం సుమారు 10 లక్షల రూపాయల నిధులను సిఎస్ ఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్సిఆర్ వోయిక్స్ మరియు హావిన్ హోల్ సంస్థలు సంయుక్తంగా అందించాయి. ఈ నిధులతో పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించబడ్డాయి.




ఇందులో భాగంగా తరగతి గదుల పూర్తి పునరుద్ధరణ, శుద్ధి చేసిన త్రాగునీటి కోసం వాటర్ ఫిల్టర్, కంప్యూటర్, ప్రింటర్, మైక్ సెట్, నూతన ఫర్నిచర్, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం తమ ముఖ్య లక్ష్యమని తెలిపారు. అదేవిధంగా స్థానిక నాయకులు, గ్రామస్థులు కలిసి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి కృషి చేయాలని కోరారు. ఈ పునరుద్ధరణ పనులను కేవలం 45 రోజుల్లో పూర్తి చేసిన ఎన్సిఆర్ వోయిక్స్, హావిన్ హోల్ సంస్థల ప్రతినిధులు శ్రీధర్, విశ్వనాథ్, నంది లను గ్రామస్థులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా పాఠశాల పునరుద్ధరణ పనులకు కృషి చేసిన మండల విద్యాధికారి కమలాకర్, జిల్లా ఆర్టీఏ సభ్యులు జైపాల్ రెడ్డిలకు స్థానికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ ఆర్ లక్ష్మి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గూడూరు మోహన్ రెడ్డి, తిగుళ్ల దర్శన్ గౌడ్, తిగుళ్ల మురళి గౌడ్, చింతల బల్వంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ తిగుళ్ల హరిబాబు గౌడ్, స్థానికులు కృష్ణ, తిగుళ్ల ప్రవీణ్ గౌడ్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వేణు, కళ్యాణి, వెంకట్ రామ్ రెడ్డి, ఉపాధ్యాయులు కుమార్, మనోహర్, సత్తిరెడ్డి, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వేసవికి ముందే నీటి సమస్యలపై చర్యలు

- సేవా దృక్పథంతో కౌన్సిలర్ ముందడుగు – గుదె వెంకటేష్‌కు ప్రశంసలు

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 20:**



వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు అలియాబాద్ మున్సిపల్ ఛైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో కౌన్సిలర్ గుదె వెంకటేష్ తన సొంత ఖర్చులతో బోర్ వేయించారు. కాగా బోర్ ను మున్సిపల్ ఛైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. రాబోవు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా 18వ వార్డులో కౌన్సిలర్ గూదె వెంకటేష్ తన సొంత ఖర్చులతో బోర్ వేయించడం సంతోషకరమని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, వైస్ ఛైర్మన్ మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు గుదె వెంకటేష్, దీపిక సాయి, దాసరి రవి, దీపిక వరప్రసాద్, కైర గణేష్, యమున శ్యామ్, వనజ అశోక్ రెడ్డి, జస్వంత్ రెడ్డి, హనుమాన్ దాస్, యూసఫ్ బాబా, మౌనిక బాబు, స్వప్న రాంప్రసాద్, సుధాకర్ రెడ్డి, గుర్క కుమార్, మౌనిక దినేష్, నాయకులు శరత్, మహేశ్, రంగారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజు, శ్రీను, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఆర్డీవోకి వినతి పత్రం

**జయభేరి, దేవరకొండ :**




భారతీయ జనతా పార్టీ దేవరకొండ రూరల్ మండలం అధ్యక్షులు నేనావత్ రాము నాయక్ ఆధ్వర్యంలో ఆర్డీవోకి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి సురేష్ జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నెరవేర్చలేని రాష్ట్ర ప్రభుత్వ హామీలను తక్షణమే అమలు చేయాలి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం జరిగింది కానీ వాటిలో ఏ ఒక్క హామీ ఇప్పటికి వరకు పూర్తిగా అమలు కాలేదు ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు దివాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణం పథకం రైతులకు రైతు భరోసా భూ సమస్యల పరిష్కారం వంటి అనేక హామీలు ఇప్పటివరకు కావడం లేదు ప్రభుత్వం మీద నమ్మకం పెట్టుకొని ఓటు వేసిన ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా సమయానికి అందకపోవడంతో రైతులు పెట్టు బడుల కోసం అప్పులపై ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడింది అలాగే నివాస ఆదాయం మరియు కుల ధ్రువీకరణ పత్రాల జారిలో తీవ్ర జాప్యం జరుగుతుంది అనేక ప్రభుత్వ పథకాల కు ఈ పత్రాలు ఇంపార్టెంట్ కావడంతో నిర్ణయిత సమయంలో ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి అర్హులు నష్టపోకుండా చూడాలనిపై సమస్యలపై ప్రభుత్వం స్పందించి మండల పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుచున్నాము ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, బిజెపి నల్లగొండ జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండాల అంజయ్య, ఎస్టి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అంజి నాయక్, బిజెపి జిల్లా నాయకులు జల్దా భాస్కర్, రెడ్డి శంకర్, జయరామ్, కేలావత్ శంకర్ నాయక్, సిద్ధు, సముద్రాల సహదేవ్, మునిని వెంకటేశ్వర్లు, అవ్వారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలు, ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయండి

- రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి
- బీజేపీ నాయకులతో కలిసి తహసిల్దార్ కి వినతి పత్రం అందజేత

**జయభేరి, షాద్ నగర్, మార్చి 20 :**



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, ఇతర హామీలను తక్షణమే అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ కొందుర్గ్ మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల రెవెన్యూ అధికారి బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి గారు మాట్లాడుతూ.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. యువ వికాసం జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, మహాలక్ష్మి పథకం, కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం వంటి కీలక హామీలు ఇప్పటికీ కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. రైతు భరోసా అందక, రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెట్టుబడి కోసం మళ్ళీ అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రావాల్సిన కొత్త పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని, అలాగే అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో నిర్వహించిన 'ప్రజాపాలన'లో సమర్పించిన దరఖాస్తులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు (డ్రైనేజీ, సిసి రోడ్లు) అధ్వాన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు, సామాన్యులకు అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో బీజేపీ తరపున పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెంది మహేందర్ రెడ్డి, కందూరి మనోహర్ రెడ్డి, బోయ శంకర్, కొమరబండ శ్రీశైలం, శివారెడ్డి, వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్ చారి, కాటంరాజు గౌడ్, నర్సింలు, శ్రీనివాస్, రఘునాథ్ రెడ్డి, వీరయ్య, యాదగిరి, యాదయ్య, నవీన్ , జి.బి.శేఖర్, వెంకటేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బడ్జెట్లో విద్యారంగంకు అన్యాయం

- బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ

**జయభేరి, దేవరకొండ :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్లో విద్యారంగంకు అన్యాయం జరిగింది అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది అని ఆయన అన్నారు. మొత్తం రాష్ట్ర బడ్జెట్ 3,24,234 కోట్లలో విద్యారంగానికి కేటాయించిన మాత్రం కేవలం 26,674 కోట్లు (8శాతం) ఇది కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో మొదటి బడ్జెట్లో 15శాతం కేటాయింపు చేస్తామని ఇచ్చిన హామీని పూర్తిగా ఈ బడ్జెట్లో కూడా విస్మరించింది అని ఆయన తెలిపారు. కనీసం 10 శాతానికి కూడా చేరుకోకపోవడం ప్రభుత్వం మాటలకూ, చేతలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని బహిర్గతం చేస్తోంది అని ఆయన అన్నారు. ఉన్నత విద్యపై సవతి తల్లి ప్రేమ కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తోంది అని ఆయన అన్నారు. బడ్జెట్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలపై ప్రభుత్వం రూ.4,343కోట్లు కేటాయింపు చేస్తామని చెప్పారు, కానీ గత బకాయిలు భారీగా పేరుకుపోయిన వాటి గురించి ప్రస్తావన లేదు. ఈ సంవత్సరం ఫీజులు మళ్ళీ అదనంగా ఉంటాయి. సుమారు రూ. 9,500 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయినా, వాటి చెల్లింపుపై స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటమేనని ఆయన అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన నియామకాల సంఖ్యలు వాస్తవానికి గతంలో ప్రారంభమైన ప్రక్రియలే తప్ప కొత్త అవకాశాలు కావని స్పష్టం చేసింది.

ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని ఆయన అన్నారు. బడ్జెట్లో 100 కోట్లు రెనోవేషన్ కోసం కేటాయింపు చేశారు అని 100 కోట్లతో హాస్టల్స్ ఎలా బాగుపడతాయని ఆయన అడిగారు. గురుకుల అద్దె భవనాలు, కెజిబివిలు అదనపు బిల్డింగ్స్, సంక్షేమ వసతిగృహాల మౌళిక సదుపాయాలు ఈ అంశాలపై సరైన ప్రస్తావన లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. విద్య రంగానికి బడ్జెట్ పెంచాలని గత బడ్జెట్ కు ఈ బడ్జెట్ కు పెంచినట్లు కనిపించేది కానీ విద్యకు తీవ్ర మొండిచెయ్యి చుపారని అని అన్నారు. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 30శాతం నిధుల కేటాయింపులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల తక్షణ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మాటలకే పరిమితం కాకుండా, విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



# పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 20 :**

తుర్కపల్లి మండలం వేల్పుపల్లి, గుజ్జవానికుంట తండా గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సర్పంచులు గుండా సిద్దులు, దూప్ సింగ్ నాయక్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న గేదలు ఆవులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తు టీకాలను ఇప్పించాలని కోరారు. గ్రామంలో 343 పశువులకు టీకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రామచంద్ర రెడ్డి, ఎల్ ఎస్ ఏ శేఖర్, వెటర్నరీ అసిస్టెంట్లు శంషుద్దీన్, గోపాలమిత్రలు హర్ష, మహేష్, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

# ఆదిమూలం అంజయ్య చిత్రపటానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 20 :**

తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన ఈసీఐఎల్ సాక్షి రిపోర్టర్ శ్రీనివాస్ తండ్రి ఆదిమూలం అంజయ్య ఇటీవల మరణించడంతో దిశదినకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచులు సోముల వెంకటేశం, భూక్య రాజారాం నాయక్ గుండా సిద్దులు, ధూప్ సింగ్ నాయక్ నాయకులు ఆదిమూలం అంజయ్య, ఆదిమూలం నరేష్, ఆదిమూలం సురేష్, బత్తిని శ్రీనివాస్, మొలుగూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించాలి



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 20 :**

గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చిన్న కిష్టయ్య అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటలు అందుబాటులో ఉండి వైద్యం అందిస్తున్న గ్రామీణ వైద్యులపై ప్రభుత్వం దాడులు నిర్వహిస్తున్నారని అట్టి దాడులను ఖండించాలని తెలంగాణ అసెంబ్లీలో ఆర్ఎంపీ సమస్యలపై వివరించాలని ప్రభుత్వ విప్ ను కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల లక్ష్మయ్య గౌడ్, తుర్కపల్లి మండల అధ్యక్షుడు పెండెం రవి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్, ఈసీ మెంబర్ రాజకుమార్, గుండాల మండల అధ్యక్షుడు వెంకన్న, ఆలేరు మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వలిగొండ మండల అధ్యక్షుడు సుధాకర్, తుర్కపల్లి మండల ఉపాధ్యక్షుడు బాలయ్య, గ్రామీణ వైద్యులు పెంటయ్య, బొడ్డు కృష్ణ, శివయ్య, కృష్ణ, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టును పరామర్శించిన ప్రభుత్వ విప్




**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 20 :**

తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన నవ తెలంగాణ సీనియర్ రిపోర్టర్ ఆరే నర్సింలు రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఆయనను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ దొంకెనిక వెంకటేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు వంగ నారాయణరెడ్డి, వార్డు సభ్యులు కరుణాకర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి బడ్జెట్ లో మొండి చెయ్యి

- సీఎం రేవంత్ రెడ్డి వద్దనే విద్యాశాఖ ఉన్నప్పటికీ విద్యారంగానికి అన్యాయం
- విద్య రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం
- కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అరకోరా నిధులు
- ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం పవన్ చౌహాన్

**జయభేరి, షాద్ నగర్, మార్చి 20 :**




విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వ మేనని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం పవన్ చౌహాన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 8.22% అంటే 26,674 కోట్ల నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తు శుద్ధి ఉందని తెలిసిందన్నారు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో డొల్లతనం కనిపిస్తుంది అన్నారు కనీసం విద్యారంగానికి కేటాయించాల్సిన మినిమం బడ్జెట్ను కూడా విద్యారంగని కేటాయించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇలా అయితే ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట ఎక్కడ వేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం 15% నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఈ సంవత్సరానికి 8.22% మాత్రమే కేటాయించడం దారుణం అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదివేల కోట్ల పెండింగ్ రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వ మాత్రం కేవలం పెండింగ్ స్కాలర్ షిప్స్ ఫీజు రీయంబర్స్ 4.343 కోట్లు కేటాయించి చేతులు దులుపుకోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 1000 కోట్లు చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయానికి 400 కోట్లు కేటాయిస్తే రాష్ట్రంలో ఉన్న మిగతా విశ్వవిద్యాలయాల పరిస్థితి ఏంటని రాష్ట్రంలో ఉన్న ఉన్నత విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు. కేటాయించడం తగదు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు. సుమారుగా 5000 కోట్ల రూపాయలను కేటాయిస్తే. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల పరిస్థితి ఏంటి. సంక్షేమ వసతి గృహాలు. కస్తూరిబా ప్రభుత్వ పాఠశాల ఊసే లేదు అన్నారు డిగ్రీ కళాశాలలు, ఇంటర్నేషనల్ పాఠశాలలు, స్వంత భవనాలు నిధులు లేవు. ఈ నిధులు విద్యా అభివృద్ధి కోసం కాదు ,విద్యా దారిద్ర్యానికి దారి తీస్తాయని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30%అధిక నిధులు కేటాయించి విద్యారంగా అభివృద్ధికి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన కోరారు.లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.



## సీసీ రోడ్డుకు, అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన..

- మెదక్ పార్లమెంట్ వర్యులు రఘునందన్ రావు కృషితో 10 లక్షల నిధులు
- బిజెపి మండల అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి

**జయభేరి, గజ్వేల్, మార్చి 20 :**

గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు విడుదల చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సీతారాంపల్లి తండాలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు మరియు అండర్ డ్రైనేజీ పనులను స్థానిక సర్పంచ్ కుక్కల అండాలు రామాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులను ఇస్తుందన్నారు. మెదక్ పార్లమెంట్ వర్యులు ఎంపీ రఘునందన్ రావు కృషితో మరిన్ని నిధులు తెచ్చి మండలాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి వినయ్,మాజీ మండలాధ్యక్షులు బాల్రెడ్డి, వెంకటేష్ గౌడ్, ఉప సర్పంచ్ అజ్మీర చిరంజీవి, వేలూరు ఉపసర్పంచ్ వెంకటేష్ యాదవ్, వార్డు మెంబర్స్ సీనియర్ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రభుత్వ విప్



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 20 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని మజీద్ ఏ మునీర్ లో శుక్రవారం ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని మహమ్మద్ జహంగీర్, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ గౌస్ ల ఆధ్వర్యంలో చేసిన ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచులు సోముల వెంకటేశం, సున్నాల రఘు, జేరిపోతుల కరుణాకర్, భూక్య రాజారాం నాయక్, పట్టణ అధ్యక్షుడు బోరెడ్డి మహిపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, మజీద్ సదర్, జహంగీర్, అమీనా సదర్ గౌస్, పదో వార్డు సభ్యుడు, నజీర్, మస్తాన్, జహంగీర్, బురాన్, సలీం, యూసుఫ్, మాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## గృహప్రవేశానికి హాజరైన ప్రదీప్ కుమార్ గౌడ్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపల్ కేంద్రంలో కడప తిమ్మప్ప నూతన గృహప్రవేశానికి దేవరకద్ర నియోజకవర్గ సీనియర్ నాయకుడు కాటం ప్రదీప్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొని ఇంటి యజమాలకు శుభాకాంక్షలు తెలిపారు.

## ముస్లిం సోదరసోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు



**జయభేరి, దేవరకొండ :**

రంజాన్ పండుగ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలోని ముస్లిం సోదర సోదరీమణులకు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజుల పాటు ఉపవాస దీక్షలతో రంజాన్ మాసం శాంతి,ప్రేమ,దయ, సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని,తెలంగాణలో గంగా జమునా తహజీబ్ కు రంజాన్ పండుగ ప్రతీక అని ఆయన తెలిపారు. దేవరకొండ నియోజకవర్గ ప్రజలంతా భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో ఇంటిల్లిపాది రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.మైనారిటీల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర తోలి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపాయని, అవన్నీ ప్రస్తుతం గుణాత్మక ఫలితాలనిస్తున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ మైనారిటీల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్ హయాంలో అమలైన ప్రజా సంక్షేమ పథకాలు యావత్ దేశానికే దిక్సూచిగా మారాయని ఆయన తెలిపారు.



## ఇచ్చిన హామీ నెరవేర్చుకున్న సర్పంచ్ పసునూరి యుగంధర్ రెడ్డి

**జయభేరి, కొండమల్లేపల్లి :**

సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా 8వ వార్డులోని మహాలక్ష్మి రైస్ ఇండస్ట్రీస్ వెనుక గల కాలనీ ప్రజలు నీళ్లకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతుంది అని వాపోయారు . ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి తన స్వంత నిధులతో బోరు వేయించడం జరిగింది. 8 వ వార్డు ప్రజలు సర్పంచ్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేసినారు.

## ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉపాధి హామీ కూలీలకు తగు జాగ్రత్తలు చెప్పిన జిపిఓ గంగ భవాని



**జయభేరి, చెన్నూరు మార్చి 20 :**

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి ఎండాకాలం తీవ్రత ఉన్నందువలన తగిన జాగ్రత్తలు తీసుకోవాలి ప్రతి ఒక్కరూ నీళ్ల బాటిల్ వెంట తెచ్చుకోవాలి అదే విధంగా తలకు రుమాలు చుట్టుకుని రావాలి ఉదయం 7:00 నుంచి 10:30 వరకు సైట్ లో ఉండాలి ప్రతి ఒక్కరికి 100 డేస్ వరకు ఉపాధి హామీ పనులు ప్రతిరోజు 307రూపాయలు దినసరి కూలీ.

## ఎమ్మెల్యే జిఎంఆర్ కు పండుగ శుభాకాంక్షలు తెలిపిన చందూ గౌడ్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కు శుక్రవారం దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు చందు గౌడ్ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన దమగ్నాపూర్ కు ఆయన వెళ్లి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# నిరుపేదలకు సహాయ నిధి వరం

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్ గుప్త

**జయభేరి, గజ్వేల్ మార్చి 20 :**



నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం అని ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్ గుప్త ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలంలో ఇటీవల ఆరోగ్య పరిస్థితి బాగాలేక ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న మండల పరిధిలోని కొట్యాల్,ములుగు, కొక్కొండ, బహిలంపూర్, అడవిమస్జిద్ గ్రామాలకు చెందిన లబ్ది దారుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం శ్రీనివాస్ గుప్త,వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్ యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని తెలిపారు. ప్రజా పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని శ్రీనివాస్ గుప్త కొనియాడారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్లు, సబ్సిడీ పై గ్యాస్ సరఫరా,ఇందిరా మహిళ శక్తి పథకాలు,మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వంటి ఎన్నో పథకాలను బడుగుల సంక్షేమార్థం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుపరుస్తుందని చెప్పారు. ఈ రోజు ఒక్క ములుగు మండలంలోని ఎనిమిది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 3 లక్షల అరవై వేల రూపాయల చెక్కులను అందజేశామని ఆయన అన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శ్రీనివాస్ గుప్త కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాలపల్లి యాదగిరి, మారమైన బాలేష్,శేఖర్, శ్రీకాంత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్.. టు.. మినిస్టర్..?

- మంత్రివర్గ పునర్వ్యస్థీకరణలో 'బీర్ల అయిలయ్యకు ఛాన్స్..!

**జయభేరి, యాదగిరిగుట్ట :**



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల అనంతరం వచ్చే ఏప్రిల్ నెలలో మంత్రి వర్గ ప్రక్షాళన జరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రివర్గ విస్తరణలో ఎవరికి కొత్తగా చోటు లభిస్తుంది అనే ఊహగానాలు వెల్లు వెత్తుతున్నాయి. బీర్ల ఐలయ్యకు మంత్రివర్గంలో చోటు లభించే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. ఆలేరు శాసనసభ్యుడిగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ గా,యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా ఒక్కొక్క రాజకీయ మెట్టు ఎక్కుతున్న బీర్ల ఐలయ్య ఎప్పటికప్పుడు తన సమర్ధతను చాటుకుంటూ.. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ దృష్టిలో...తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో పడ్డారు. సామాజిక వర్గం పరంగా చూసినా...యాదవ సామాజిక వర్గం నుంచి ఆయనకు అవకాశం అధికంగా కనిపిస్తోంది. రానున్న రెండున్నర సంవత్సరాలు ప్రభుత్వానికి కీలకమైనవి..శాసనసభ లోపల వెలుపల విపక్షాలు తమ వాయిస్ ను పెంచుతాయి..విపక్షాల విమర్శలను తిప్పి కొట్టడంలో బీర్ల ఐలయ్య సిద్ధహస్తులు. మంత్రి వర్గంలో ఒక విప్ కు ఛాన్స్ ఇస్తే.. అది ఐలయ్యకు దక్కనున్నదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ,మున్సిపల్ ఎన్నికలలో ఆయన తన సత్తా చాటుకున్నారు. చక్కని ఎన్నికల వ్యూహ రచనతో మంచి ఫలితాలు సాధించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో కాంగ్రెస్ కు తిరుగులేదు.. అనే స్థితికి తీసుకు వచ్చారు. ప్రజాభిమానం, వాగ్దాటి, కాంగ్రెస్ పార్టీలోను, ప్రభుత్వంలోనూ మంచిపట్టు సాధించిన బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి తథ్యమని ప్రజలు భావిస్తున్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలోనూ...సభలు సమావేశాలలోనూ... ప్రభుత్వకార్యక్రమాలలోనూ... ఆయన నిత్య పర్యటనలతో బిజీ బిజీగా గడుపుతూ ప్రతినిత్యం వార్తల్లో వ్యక్తిగా ఘనత కెక్కారు. తనకు ఏ పదవి లభించిన ఆ పదవికి వన్నె తీసుకురావడం ఆయనకే చెల్లింది. కాంగ్రెస్ కంచుకోటగా యాదాద్రి భువనగిరి జిల్లాను ర్చిదిద్దుతున్న బీర్ల ఐలయ్యకు కేబినెట్ బెర్త్ ఖాయంగా కనిపిస్తోంది.

# గోదావరిలో విషాదం..

## 5 మంది బీటెక్ విద్యార్థులు గల్లంతు

**జయభేరి, భద్రాద్రి కొత్తగూడెం :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పరిధిలో గోదావరి నదిలో జరిగిన విషాద ఘటనలో ఐదుగురు బీటెక్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఉగాది సెలవుల సందర్భంగా స్నేహితులతో కలిసి వచ్చిన వీరు నదిలో స్నానాలకు దిగగా ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. అమరావతి లోని ఎస్ఆర్ఎంటీ (SRMT) కాలేజీలో బీటెక్ రెండోసంవత్సరం చదువుతున్న విద్యార్థులు, భద్రాచలం ప్రాంతానికి చెందిన తమ మిత్రులు అభిరామ్, శ్రీకర్ లతో కలిసి ఎటపాక మండలం లోని పురుషోత్తమపట్నం గ్రామ శివారులో ఉన్న కొల్లిగూడెం ఇసుక ర్యాంప్ సమీపంలోని గోదావరి నదిలోకి దిగారు. ఫోటోలు తీసుకుంటూ ఉండగా ఏడుగురు యువకులు అకస్మాత్తుగా ప్రవాహంలో కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు ఈత రావడంతో ఒడ్డుకు చేరుకోగా, మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని అభిరామ్, శ్రీకర్, తేజ, సతీష్, నవదీప్‌లుగా గుర్తించారు. ఇందులో అభిరామ్, శ్రీకర్ భద్రాచలం ప్రాంతానికి చెందినవారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు ప్రారంభించారు.





# నెల రోజుల పాటు.. చక్కెర తినడం మానేసి చూడు

**మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుక్కీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి.**

### కొవ్వు కరుగుతుంది..

డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

### కొలెస్ట్రాల్ అదుపులో..

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

### ఉత్సాహంగా మారుతారు..

అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్ధకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగాఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.



# జంక్ ఫుడ్ మానేస్తే.. మీ ముఖంలో కనిపించే మార్పులు

**జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని అందరికీ తెలుసు. అయినా సరే చాలామంది ఆ ఫుడ్ నే ఇష్టంగా తింటుంటారు. కానీ జంక్ ఫుడ్ ని ఒక 30 రోజులు మానేస్తే మీ శరీరంలో ఎన్ని మార్పులు జరుగుతాయో తెలుసా? ముఖ్యంగా ఫేస్ లో కనిపించే ఈ మార్పులు చూస్తే షాక్ అవుతారు.**

### 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే..

మనలో చాలామంది ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్, కేక్‌లు, చిప్స్ వంటి పదార్థాలను ఇష్టంగా తింటుంటారు. కానీ అవి మన శరీరం, ముఖ్యంగా చర్మంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసా? ఆరోగ్య నిపుణులు, స్కిన్ కేర్ ఎక్స్‌పర్ట్‌ల ప్రకారం కేవలం 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా ముఖంలో కలిగే మార్పులేంటో ఇక్కడ తెలుసుకుందాం.

### మృదువుగా మారుతుంది

జంక్ ఫుడ్ ఎక్కువగా సాచ్యురేటెడ్ ఫ్యాట్స్, షుగర్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది చర్మంలో ఇన్ఫ్లమేషన్ ను పెంచుతుంది. ముడతలు, ఎరుపు, పొడిబారడం వంటి సమస్యలకు కారణమవుతుంది. జంక్ ఫుడ్ మానేసిన వెంటనే, శరీరంలోని ఇన్ఫ్లమేటరీ రియాక్షన్స్ తగ్గుతాయి. 30 రోజుల్లో చర్మం సహజంగా హైడ్రేటెడ్ గా, మృదువుగా మారుతుంది. ముఖ్యంగా కేకులు, కోల్డ్ డ్రింక్స్, చిప్స్ మానడం వల్ల చర్మం.. లోపలి తేమను నిలుపుకోవడానికి అవకాశం ఉంటుంది.

### కొల్లాజెన్ ఉత్పత్తిపై ప్రభావం

షుగర్ అధికంగా తీసుకోవడం వల్ల చర్మంలోని కొల్లాజెన్ దెబ్బతింటుంది. కొల్లాజెన్ శక్తిని కోల్పోవడం వల్ల చర్మంపై ముడతలు మొదలవుతాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా, కొల్లాజెన్ ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. దానివల్ల చర్మం స్థిరంగా ఉంటుంది, ముడతలు తగ్గుతాయి. కాంతివంతంగా మారుతుంది.

### ముఖం స్లిమ్ గా కనిపించడం

జంక్ ఫుడ్ ఎక్కువగా సోడియం, ఫ్యాట్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో వాటర్ రిటెన్షన్, మలినాలు, ఫేస్ బ్లోటింగ్ కు కారణమవుతుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం, 30 రోజులు జంక్ ఫుడ్ మానేసి.. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఫేస్ బ్లోటింగ్ తగ్గి ముఖం స్లిమ్ గా కనిపిస్తుంది. అలాగే, యాంటీ ఆక్సిడెంట్‌లు ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకోవడం వల్ల చర్మం లోపలి నుంచి మెరుగుపడుతుంది.

### ముఖం ఫ్రెష్ గా..

జంక్ ఫుడ్ లోని ఫ్యాటీ, ప్రాసెస్డ్ పదార్థాలు శరీరంలోని యాంటీఆక్సిడెంట్ స్థాయిలను తగ్గిస్తాయి. చర్మం యూవీ కిరణాల ప్రభావానికి లోనవుతుంది. జంక్ ఫుడ్ మానేసి.. ఇతర ఫ్రూట్స్, వెజిటబుల్స్ తీసుకుంటే వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు చర్మ రికవరీని వేగవంతం చేస్తాయి. సన్ డ్యామేజ్ తగ్గి, చర్మం తాజాగా మారుతుంది.

### ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

చర్మంలో కనిపించే ఈ మార్పులు మానసికంగా పెద్ద మార్పులకు దారితీస్తాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే.. ముఖం స్పష్టంగా మెరుస్తుంది, చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. జంక్ ఫుడ్ మానేయడం ఒక్క చర్మ ఆరోగ్యానికే కాదు.. మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



# జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి?

**జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరగడానికి మనం తలకు నూనె రాస్తుంటాం. తలపై నూనెతో స్మూత్ గా మసాజ్ చేస్తే ప్రశాంతంగా అనిపిస్తుంది. జుట్టు కుదుళ్లు కూడా బలపడతాయి. జుట్టు చక్కగా పెరగాలంటే ఎన్ని రోజులకు ఒకసారి నూనె రాయాలి? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా?**

మనం జుట్టుకు రెగ్యులర్ గా నూనె రాస్తుంటాం. దానివల్ల జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. కానీ జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి? రోజూ రాయడం మంచిదా? లేక వారంలో ఒకటిరెండు సార్లు రాస్తే సరిపోతుందా? నిపుణులు ఏం చెబుతున్నారో ఇక్కడ వివరంగా తెలుసుకుందాం.

### వారానికి 1-2 సార్లు

ఆరోగ్య నిపుణుల ప్రకారం జుట్టుకు వారానికి 1-2 సార్లు ఆయిల్ రాయడం మంచిది. సాధారణ లేదా డ్రై హెయిర్ ఉన్నవారు వారానికి రెండు సార్లు రాసుకోవచ్చు. ఆయిలీ స్కాల్ప్ ఉన్నవారు వారానికి ఒకసారి జుట్టుకు నూనె రాస్తే సరిపోతుంది. దానివల్ల స్కాల్ప్ ఉత్పత్తి చేసే సహజ నూనెలపై చెడు ప్రభావం పడదు.

### రోజూ రాస్తే ఏమవుతుంది?

సాధారణంగా చాలామంది రోజూ నూనె రాసుకుంటే జుట్టు బాగా పెరుగుతుందని అనుకుంటారు. కానీ దానివల్ల హెయిర్ ఫోలికల్స్ బలహీనపడే అవకాశం ఉంది. అంతేకాదు దుమ్ము, ధూళి వంటివి తలపై చేరి చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. ఫలితంగా చుండ్రు, ఇరిటేషన్, హెయిర్ ఫాల్ వంటి సమస్యలు ఎదురవుతాయి.

### నూనె వేడి చేసి రాస్తే..

ఆయిల్ వాడటం వల్ల జుట్టుకు హైడ్రేషన్ లభిస్తుంది. తలపై స్మూత్ గా మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. అయితే చాలామంది నూనెను కొద్దిగా వేడి చేసి జుట్టుకు అప్లై చేస్తుంటారు. గోరువెచ్చని నూనెతో తలపై మసాజ్ చేస్తే.. జుట్టులోకి సులభంగా ఇమిడిపోతుంది. అలాగే రక్తప్రసరణ మెరగవుతుంది. కానీ నూనెను ఎక్కువ వేడి చేయడం మంచిది కాదు. అదే విధంగా జుట్టుపై బలంగా రుద్దడం కూడా ప్రమాదకరం అని నిపుణులు సూచిస్తున్నారు.

### ఎక్కువసేపు ఉంచితే?

జుట్టుకు నూనె రాసిన తర్వాత మరీ ఎక్కువసేపు ఉంచకూడదు. 45 నిమిషాల నుంచి 2 గంటల వరకు ఉంచితే సరిపోతుంది. దానికంటే ఎక్కువసేపు ఉంచితే.. ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్లు, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలు ఎదురవుతాయని సూచిస్తున్నారు.

### ఏ నూనె వాడొచ్చు?

నిపుణుల ప్రకారం జుట్టు రకాన్ని బట్టి నూనెను ఎంచుకోవాలి. పొడి జుట్టుకు కొబ్బరి నూనె వాడొచ్చు. కొబ్బరినూనె జుట్టు లోపలి వరకు చొచ్చుకుపోయే గుణాలను కలిగి ఉంటుంది. అలాగే మందపాటి జుట్టుకు బాదం నూనె, జుట్టు పెరుగుదలకు ఆముదం నూనె వంటివి వాడొచ్చు.



# అశ్లీల సాహిత్యంపై మత పెద్దల అభ్యంతరం




కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్' లోని 'సర్కే చునార్ తేరి సర్కే' పాట తీవ్ర వివాదాలకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన ముస్లిం పర్సనల్ దారుల్ ఇఫ్తా అనే మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. ఈ పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని సదరు సంస్థ పేర్కొంది. ఇటువంటి ప్రదర్శనలు సమాజంలో తప్పుడు సందేశాన్ని పంపుతాయని, ముఖ్యంగా ముస్లిం యువతను తప్పుదోవ పట్టిస్తాయని వారు తమ ఫత్వాలో పేర్కొన్నారు. మరోవైపు ఈ పాటకు దేశవ్యాప్తంగా వస్తున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ఈ విషయాన్ని ధృవీకరించారు. మరోవైపు ఈ వివాదంపై నోరా ఫతేహీ స్పందిస్తూ.. ఈ పాట హిందీ వెర్షన్‌లో తనకేమీ సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. మూడేళ్ల క్రితం సంజయ్ దత్ వంటి దిగ్గజ నటుడితో కలిసి నటించే అవకాశం రావడం, అలాగే ఇది 'నాయక్ నహి ఖల్ నాయక్ హూ మై' వంటి ఐకానిక్ సాంగ్ రీమేక్ అని భావించి తాను అంగీకరించానని తెలిపారు. తనకు కన్నడ భాష తెలియదని, మేకర్స్ చెప్పిన అనువాదం అప్పట్లో అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె వివరణ ఇచ్చారు. ధ్రువ సర్జా హీరోగా, ప్రేమ్ దర్శకత్వంలో 1970ల నాటి బెంగళూరు నేపథ్యంతో తెరకెక్కిన 'కేడీ: ద డెవిల్' చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది. ఫత్వాను గౌరవించి, సదరు వ్యక్తిని లేదా విషయాన్ని దూరం పెట్టే అవకాశం ఉంటుంది. దీనివల్ల వ్యక్తుల ప్రతిష్టకు భంగం కలగడం లేదా వారు సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుంది. అయితే భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాల్లో ఫత్వాకు ఎటువంటి చట్టపరమైన గుర్తింపు లేదు. ఫత్వా జారీ చేసినంత మాత్రాన పోలీసులు ఎవరినీ అరెస్టు చేయలేరు లేదా కోర్టులు దానిని తీర్పుగా పరిగణించవు. రాజ్యాంగం ప్రకారం దేశ చట్టాలే అత్యున్నతమైనవి.




# గద్దర్ ఫిలిం అవార్డ్స్ వేడుకలో చిరంజీవి సంచలన వ్యాఖ్యలు..

ఉగాది సందర్భంగా హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్స్ వేడుకలో చిరంజీవి కీలక వ్యాఖ్యలు చేశారు. కళాకారులను గౌరవించే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గద్దర్ ఫిలిం అవార్డ్స్ వేడుక మార్చ్ 19న ఉగాది సందర్భంగా హైటెక్స్ లో ఘనంగా జరిగింది. 2025 సంవత్సరానికి గాను ప్రకటించిన ఈ అవార్డుల ప్రదానోత్సవానికి సినీ, రాజకీయ ప్రముఖులు, అనేక మంది సెలబ్రిటీలు భారీగా హాజరయ్యారు. ఈ వేడుకలో మెగాస్టార్ చిరంజీవి కు ఎన్టీఆర్ నేషనల్ అవార్డు ప్రదానం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చిరంజీవి ఈ గౌరవాన్ని అందుకున్నారు. అవార్డు స్వీకరించిన అనంతరం చిరంజీవి తన ప్రసంగంలో పలువురు విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. కళాకారులు ఎక్కడ గౌరవించబడతారో ఆ రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుంది అనే నానుడి ఉంది. ఆ భావాన్ని అర్థం చేసుకుని ఆగిపోయిన అవార్డులకు పునర్జీవం పోసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ గారికి ధన్యవాదాలు, అని అన్నారు. అలాగే పక్క రాష్ట్రంపై కూడా చిరు కొన్ని కామెంట్స్ చేశారు . మన తెలుగు రాష్ట్రాల్లో ఒకటి సినిమాల పట్ల, కళాకారుల పట్ల ప్రోత్సాహం విషయంలో కొంత వెనుకంజలో ఉందనిపిస్తోంది. కాబట్టి సినిమాలకు దగ్గరగా ఉండే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు దీన్ని ప్రేరణగా తీసుకుని మరింత ప్రోత్సాహం ఇవ్వాలి. ఆ ప్రోత్సాహం వల్ల ప్రభుత్వానికి కూడా మంచి రెవెన్యూ వస్తుంది అని విన్నవించారు. చిరంజీవి చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. సినీ రంగానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఎంత ముఖ్యమో మరోసారి ఆయన గుర్తుచేసినట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వేడుకతో గద్దర్ ఫిలిం అవార్డ్స్ మళ్లీ వైభవంగా పునఃప్రారంభమవడం సినీ పరిశ్రమలో ఆనందాన్ని కలిగిస్తోంది.

# స్వజనుల సంరక్షణ కోసం..



సాయిదుర్గతేజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్ కేపీ దర్శకత్వంలో ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె.నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం క్లైమాక్స్ ఘట్టాల చిత్రీకరణ జరుగుతున్నది. ప్రముఖ స్టంట్ డైరెక్టర్ కెవిన్ ఆధ్వర్యంలో రోమాంచితమైన యాక్షన్ ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో సాగే పీరియాడిక్ కథ ఇదని, ఓ క్రూరుడైన నియంతను అంతమొందించి తన గ్రామ ప్రజలను కాపాడే రక్షకుడిగా సాయిదుర్గతేజ్ పాత్ర శక్తివంతంగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. రా అండ్ రస్టిక్ ఫీల్‌తో సాగే యాక్షన్ డ్రామాగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని దర్శకుడు తెలిపారు. ఐశ్వర్యలక్ష్మి, జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాతలు: కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి, రచనదర్శకత్వం: రోహిత్ కె.పి.

# అందుకే సినిమాలు చేయలేదట..



ప్రాచీ థాకర్.. ఈ పేరు చెప్తే పెద్దగా ఎవ్వరూ గుర్తుపట్టకపోవచ్చు కానీ కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన పటాస్ సినిమా చూస్తే ఈ అమ్మడిని గుర్తిపట్టేస్తారు. పటాస్ సినిమాలో కళ్యాణ్ రామ్ చెల్లిగా కనిపించింది ప్రాచీ. ఆ సినిమాలో మాటలు రాని అమ్మాయిగా కనిపించింది. అయితే ప్రచీ ఠాకూర్ ఆ సినిమా తర్వాత పెద్దగా ఎక్కడా కనిపించలేదు. సినిమాలు కూడా పెద్దగా చేయలేదు. దాంతో ఈ అమ్మడు ఏమైపోయిందా అని చాలా మంది గూగుల్ ను గాలించారు కూడా.. ఇదిలా ఉంటే ఓ ఇంటర్వ్యూలో ప్రాచీ చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి. హైదరాబాద్‌లో టెక్స్‌టైల్ డిజైనింగ్ చదువుతున్న సమయంలో మోడలింగ్‌పై ఆసక్తి పెరిగింది. ఒకసారి స్నేహితుల ద్వారా ఆడిషన్ గురించి తెలుసుకుని, ప్రశాంత్ దర్శకత్వంలో సైలెంట్ మెలోడీ అనే ప్రాజెక్ట్‌లో అవకాశం అనుకున్నా అని తెలిపింది. ఈ ప్రాజెక్ట్‌లో ఆమె మాటలు లేని పాత్రలో నటించింది. ఈ సైలెంట్ మెలోడీలో ఆమె నటన చూసిన అనిల్ రావిపూడి, తన పటాస్ సినిమాలో ఒక ముఖ్యమైన పాత్రకు ప్రచీని ఎంపిక చేశారట. పటాస్ సినిమా కళ్యాణ్ రామ్ కెరీర్‌లోనే ఒక పెద్ద విజయంగా నిలిచింది. ఈ సినిమాలోప్రాచీ పాత్రకు ప్రశంసలు లభించాయి. అయితే, ఈ విజయాన్ని తాను సరిగ్గా సద్వినియోగం చేసుకోలేకపోయానని ప్రచీ తెలిపింది. ఆ సమయంలో ఆమె కాలేజీ మూడవ సంవత్సరంలో ఉండటం, పరిశ్రమలో మార్గనిర్దేశం చేసేవారు ఎవరూ లేకపోవడం దీనికి ప్రధాన కారణం అని తెలిపింది. తన తల్లిదండ్రులు నిఫ్ట్ కోసం భారీ ఫీజులు కట్టారు, కాలేజీని బంక్ చేసి షూటింగ్‌లకు వెళ్లడానికి ఆలోచించా అని ఆమె తెలిపారు. ఆ సమయంలో తనకు సీరియల్, సినిమా ఆఫర్లు వచ్చినా, వాటిని స్వీకరించడానికి సరైన మార్గదర్శకత్వం లేదని చెప్పుకొచ్చింది. భాషా కూడా కూడా ఆమెకు ఒక సవాలుగా నిలిచింది. సైలెంట్ మెలోడీ, పటాస్ చిత్రాలలో ఆమె మాటలు లేని పాత్రలు చేశా.. ఈ కారణంగా, కొంతమంది ప్రేక్షకులు ఆమెను నిజంగానే చెవిటి, మూగ (డెఫ్ అండ్ మ్యూట్) అని భావించారని, ఫేస్‌బుక్‌లో మెసేజ్‌లు కూడా వచ్చాయని ప్రచీ గుర్తుచేసుకుంది. ఇదే తరహా పాత్రలలో టైప్‌కాస్ట్ అవ్వకూడదనే ఉద్దేశ్యంతో, పటాస్ తమిళ రీమేక్‌లో అదే పాత్రను పోషించమని ఆఫర్ వచ్చినా ఆమె నో చెప్పిందట. కాలేజీ గ్రాడ్యుయేషన్ తర్వాత, ప్రచీ ఠాకూర్ కొంతకాలం పరిశ్రమకు దూరమయ్యింది. 2019లో బ్యాడ్ ట్రిప్ సినిమా కోసం హైదరాబాద్‌కు మకాం మార్చారు. ఆ తర్వాత కోవిడ్ మహమ్మారి వచ్చినా, లవ్ యూ టూ వంటి చిత్రాలలో నటించింది. ప్రస్తుతం అవకాశాల కోసం ఎదురుచూస్తున్నా అని తెలిపింది ఈ అందాల తార.. అలాగే సవాలుతో కూడిన పాత్రలను పోషించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పుకొచ్చింది నటి ప్రాచీ. ప్రస్తుతం హిందీలో సినిమాలు, సిరీస్ లు చేస్తుంది. మొన్నామధ్య బకాసుర రెస్టారెంట్ అనే సినిమాలో కనిపించింది.

# అనుకోకుండా గర్భం.. ఇష్టం లేకున్నా పెళ్లి చేసుకున్నా..





తెలుగు సినిమా ఇండస్ట్రీలో అందం, అభినయంతో ఆకట్టుకున్న హీరోయిన్లలో అమలాపాల్ ఒకరు. లవ్ ఫెయిల్యూర్ సినిమాతో తెలుగు ఆడియెన్స్ ను పలకరించిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత బెజవాడ, నాయక్, ఇద్దరమ్మాయిలతో తదితర సినిమాలతో టాలీవుడ్ లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలాగే తమిళం, మలయాళం సినిమాల్లోనూ నటించి అక్కడి ప్రేక్షకులకు బాగా చేరువైంది. కొన్ని వెబ్ సిరీసుల్లోనూ నటించి మెప్పించిన అమలా పాల్ వ్యక్తిగత జీవితంలో మాత్రం తీవ్ర ఆటు పోట్లు ఎదుర్కొంది. మొదట తమిళ దర్శకుడు ఏఎల్ విజయ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుందీ ముద్దుగుమ్మ. అయితే కొన్నేళ్లకే ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. 2014లో పెళ్లి చేసుకున్న వీరు 2017లో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకుని విడిపోయారు. ఆ తర్వాత చాలా ఏళ్ల వరకు సింగిల్ గానే లైఫ్ లీడ్ చేసింది అమలా పాల్. సినిమాలతో బిజీ బిజీగా గడిపింది. అయితే 2023లో సడెన్ గా రెండో పెళ్లి చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది అమలాపాల్. ప్రముఖ బిజినెస్ మ్యాన్ జగత్ దేశాయ్ ని ఆమె ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే అప్పట్లో ఈ పెళ్లిపై చాలా రూమర్లు వచ్చాయి. అమలాపాల్ గర్భం దాల్చిందని అందుకే సడెన్ గా పెళ్లి చేసుకుందని ప్రచారం జరిగింది. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన అమలా పాల్ తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. అలాగే జగత దేశాయ్ తో ప్రేమ పెళ్లి, సంతానంపై ఓపెన్ కామెంట్స్ చేసింది. 'జగత్ దేశాయ్‌తో నా బంధం గురించి ఓపెన్. అందులో దాచిపెట్టాల్సిందేమీ లేదు. మా మనసులు మాత్రమే కాదు శారీరాలు కలిశాయి. దాంతో నాకు అనుకోకుండా గర్భ వచ్చింది. ప్రెగ్నెన్సీ కారణంగా మా పెళ్లి అనుకోకుండా జరిగింది. సమాజం కోసం బలవంతంగా నేను రెండో పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది' అని చెప్పుకొచ్చిందీ అందాల తార.

ప్రస్తుతం అమలా పాల్ కామెంట్స్ నెట్టింట వైరలవుతున్నాయి. కాగా ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉందీ హీరోయిన్. తన టైమ్ ను పూర్తిగా ఫ్యామిలీకే కేటాయిస్తోంది. కొడుకు ఇలాయ్‌తో ఆడుతూ పాడుతూ ఉండే వీడియోలను, ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తోంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**